

తెలంగాణ

ప్రతి వార్త సంచలనం



హైదరాబాద్, విజయవాడ సంపుటి : 01 సంచిక : 283 బుధవారం 18 నవంబర్ 2026 పేజీలు : 8 వెల : 2/-

ఎన్విడియాలో 62 మిలియన్ డాలర్ల విలువైన షేర్లు కలిగి ఉన్న ట్రంప్

ట్రంప్-ఎన్విడియా బంధం పై పెరుగుతున్న అనుమానాలు

ఎన్విడియాకు 'నేషనల్ ఛాంపియన్' హోదా ఇచ్చే యోచనలో ప్రభుత్వం

ట్రంప్‌కు అత్యంత సన్నిహితుడిగా ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్



భారత్ అభివృద్ధి, ఆసియాన్ శ్రేయస్సు ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయన్న మోదీ

'యాక్ట్ ఈస్ట్' విధానంతో ఇరుపక్షాల మధ్య బంధం మరింత బలోపేతం

వికసిత భారత్ 2047, ఆసియాన్ విజన్ 2045 లక్ష్యాలు కీలకం

ప్రస్తుత ప్రపంచానికి శాంతి, స్థిరత్వం ఎంతో అవసరమని వ్యాఖ్య



రాయ్‌పూర్‌లో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల కీలక భేటీ

సమ్మక్క సాగర్ ప్రాజెక్టు ఎన్ఓసీ మంజూరు పై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి సానుకూల స్పందన

సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్ఓసీ ఇవ్వండి: ఛత్తీస్‌గఢ్ సీఎంకు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

తుపాకులగూడెం వద్ద ఇప్పటికే పూర్తయిన బ్యారేజీ నిర్మాణం

నిబంధనల ప్రకారం పరిహారం, పునరావాస నిధులు ఇచ్చేందుకు తెలంగాణ సిద్ధం



ప్రపంచస్థాయి ప్రెసిషన్ ఇంజినీరింగ్ హబ్‌గా హైదరాబాద్



ప్రపంచ స్థాయి ప్రెసిషన్ ఇంజినీరింగ్ హబ్‌గా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తామని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఏరోస్పేస్ గ్లోబల్ సప్లై చైన్‌లో 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్‌కు గుర్తింపు తెస్తామని తెలిపారు.

జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా జర్నలిస్టుల భద్రతకు టీజెఏ డిమాండ్



జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా జర్నలిస్టులకు శుభాకాంక్షలు; జర్నలిస్టుల సంక్షేమం, భద్రత కోసం టీజెఏ కట్టుబడి ఉంది: కె.వి. రమణారావు

జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా, తెలంగాణ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బుద్ధ భవన్‌లో ఉన్న రాష్ట్ర కార్యాలయంలో ఈ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ప్రజల ఆశీర్వాదమే నా బలం: సీతక్క

ప్రజల కోసం పోరాటం చేసిన నాటి నుంచి నేటి వరకు తన జీవితమంతా ప్రజాసేవకే అంకితమైందని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. గోవిందరావుపేట మండల కేంద్రంలో నిర్వహించిన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని లబ్ధిదారులకు – మిగతా2లో



సోనియా గాంధీ ఆత్మకథలో తెలంగాణ ప్రస్తావన ఏది



సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాం గింగ్' పుస్తకం పై బీఆర్ఎస్ అధినేత కేటీఆర్ స్పందించారు. తెలంగాణ ఇచ్చింది సోనియమ్మేనని కాంగ్రెస్ నేతలు చెప్పుకుంటు ంటారని.. మరి ఆమె ఆత్మకథలో తెలంగాణ ప్రస్తావన ఎందుకు లేదని ప్రశ్నించారు. – మిగతా2లో

కాంగ్రెస్ మేనిఫెస్టోను మోసాల చిట్టాగా అభివర్ణించిన హరీశ్‌రావు



పవిత్ర గ్రంథాల మీద చేసిన ప్రమాణాలను గాలికొదిలేశారని విమర్శలు

38 క్యాబినెట్ భేటీలు జరిగినా 6 గ్యారెంటీలకు చట్టబద్ధత ఏదని ప్రశ్న

ఇచ్చిన హామీలపై రేవంత్ రెడ్డి, ఖర్గే సమాధానం చెప్పాలని డిమాండ్

రాయ్‌పూర్‌లో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల కీలక భేటీ

ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద గోదావరి నదిపై నిర్మించిన బహుళ ప్రయోజనాల సమ్మక్క సాగర్ బ్యారేజీకి సంబంధించి వెంటనే నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) జారీ చేయాలని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాయ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమ్మక్క సాగర్ ప్రాజెక్టు సమగ్ర వివరాలను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి వివరించి, త్వరితగతిన ఎన్ఓసీ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సీఎం విష్ణుదేవ్ సాయి సానుకూలంగా స్పందిస్తూ, ఎన్ఓసీ ప్రక్రియను త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా తెలంగాణలో నీటి అవసరాలు పెరిగే అవకాశం ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రజల తాగు, సాగునీటి అవసరాల నిమిత్తం సమ్మక్క సాగర్ బ్యారేజీలో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుమతించాలని, మిగిలిన క్లియరెన్సుల విషయంలోనూ సహకరించాలని కోరారు. కరవు ప్రభావిత, వెనుకబడిన, గిరిజన ప్రాంతాల అవసరాలను తీర్చేందుకు గోదావరి జలాలను వినియోగించుకోవడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. గతంలో ఈ ప్రాజెక్టును కాంతనపల్లి వద్ద ప్రతిపాదించగా, అక్కడ 11,408 ఎకరాల భూమి ముంపునకు గురయ్యే పరిస్థితి ఉండేది. దీనివల్ల 17 ఆదివాసీ గ్రామాలు మునిగిపోవడంతో పాటు భద్రత, మౌలిక వసతుల పై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఏర్పడింది. దాంతో ముంపు తీవ్రతను కనిష్ఠ స్థాయికి తగ్గించేందుకు బ్యారేజీ నిర్మాణ ప్రదేశాన్ని తుపాకుల గూడెంకు మార్చినట్లు ముఖ్యమంత్రి వివరించారు. ప్రాజెక్టు ప్రభావం పై అధ్యయనం జరిపేందుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన మేరకు తెలంగాణ సర్కార్ రూ. 9.883 కోట్లను ఏప్రిల్‌లోనే చెల్లించింది. అనంతరం క్షేత్రస్థాయి అధ్యయనం పూర్తి చేసిన ఐఐటీ ఖరగ్‌పూర్ తన నివేదికను జూలై 30న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి అందజేసింది. తుపాకులగూడెం వద్ద బ్యారేజీ నిర్మించడం వల్ల ఛత్తీస్‌గఢ్ పరిధిలో కేవలం 33 ఎకరాల భూమి మాత్రమే ముంపునకు గురవుతుందని ఈ నివేదిక స్పష్టం చేసింది. అత్యంత భారీ వరదలు వచ్చిన సందర్భంలో కూడా ఈ ముంపు ప్రాంతం 100 ఎకరాలకు మించదని తేలింది. తుపాకులగూడెం వద్ద ఇప్పటికే సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం పూర్తయింది. పూర్తిస్థాయి నీటిమట్టం +83 మీటర్ల వద్ద ఈ బ్యారేజీ నిల్వ సామర్థ్యం 6.94 టీఎంసీలుగా ఉంది. ఛత్తీస్‌గఢ్ భూభాగంలో అవసరమైన భూసేకరణ, పరిహారం, పునరావాస చర్యలకు సంబంధించి నిబంధనల ప్రకారం నిధులు చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నిర్మాణం పూర్తయినందున ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎన్ఓసీ జారీతో పాటు ఇతర అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రపంచస్థాయి ప్రెసిషన్ ఇంజినీరింగ్ హబ్‌గా హైదరాబాద్

మంగళవారం రంగారెడ్డి జిల్లా కొత్తూరు తిగాపూర్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన జేఈహెచ్ ఏరోస్పేస్ సంస్థతోపాటు టూలింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి డి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రెసిషన్ ఇంజినీరింగ్‌కు కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని చెప్పారు. తెలంగాణలో ఏరోస్పేస్ పరిశ్రమల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. ఈ సంస్థ ఏర్పాటుతో విమాన విడిభాగాల తయారీ, మరమ్మతులకు అవసరమైన అధునాతన టూల్స్ అందుబాటులోకి వస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. విమానాలు, విమాన ఇంజిన్ల తయారీ, నిర్వహణకు ప్రత్యేక పరికరాలు తయారవుతాయని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. ఇప్పటివరకు విదేశాల పై ఆధారపడుతున్న టూలింగ్ అవసరాలకు ఇక పై స్థానికంగానే తయారవుతాయని అన్నారు. ఏరోస్పేస్ రంగంలో జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ప్రకటించారు. డిజైన్, ఇంజినీరింగ్, ప్రెసిషన్ మ్యాన్యుఫ్యాక్చరింగ్‌కు ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. గ్లోబల్ కంపెనీలతో స్థానిక ఎంఎస్ఎంఈల అనుసంధానానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. అడ్వాన్స్‌డ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, రక్షణ రంగాలకు తెలంగాణను కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. 'తెలంగాణ రైజింగ్-2047' విజన్‌లో భాగంగా ప్రపంచ స్థాయి పారిశ్రామిక వాతావరణాన్ని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన ప్రణాళికలు అమలు చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. తిగాపూర్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏరోస్పేస్ టూలింగ్ సెంటర్ ఏర్పాటు కావడం సంతోంగా ఉందని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్ పారిశ్రామిక ప్రగతిలో ఇది మరో మైలురాయిగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. విమానాలు, ఏరో ఇంజిన్ల తయారీ, నిర్వహణకు అవసరమైన అత్యాధునిక పరికరాలు, ఫిక్చర్లను ఈ కేంద్రంలో తయారు చేయనున్నట్లు వివరించారు. ఇప్పటివరకు దిగుమతుల పై ఆధారపడిన ఈ రంగంలో దేశీయ తయారీ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఈ సంస్థ దోహద పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి ప్రెసిషన్ ఇంజినీరింగ్ కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు, తెలంగాణలో ఆధునిక పరిశ్రమల అభివృద్ధికి ఇలాంటి సంస్థలు తోడ్పడతాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పారిశ్రామిక రంగానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. షాద్‌నగర్ ప్రాంతంలో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో సంస్థను ఏర్పాటు చేసినందుకు జేఈహెచ్ ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధుల బృందానికి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

సోనియా గాంధీ ఆత్మకథలో తెలంగాణ ప్రస్తావన ఏది

తెలంగాణ ఇచ్చింది సోనియమ్మేనని కాంగ్రెస్ నేతలు చెప్పుకుంటుంటారని.. మరి ఆమె ఆత్మకథలో తెలంగాణ ప్రస్తావన ఎందుకు లేదని ప్రశ్నించారు. తెలంగాణపై కాంగ్రెస్‌కు ఎన్నడూ నిజమైన ప్రేమ లేదని.. రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందని కేటీఆర్ ఆరోపించారు. 'సోనియా గాంధీ ఆత్మలో తెలంగాణ లేదు.. గుండెల్లో తెలంగాణ లేదు. తెలంగాణ రాష్ట్రం సోనియా గాంధీ దయాభిక్ష కాదు.. తెలంగాణ ప్రజల పోరాట ఫలితం. కేసీఆర్ నాయకత్వంలో సాగిన ప్రజా ఉద్యమమే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి అసలు కారణం. తెలంగాణ ప్రజలు సృష్టించిన రాజకీయ అనివార్య పరిస్థితులకు తలొగ్గే కాంగ్రెస్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది. తెలంగాణ ఉద్యమ ఉప్పెనలో కొట్టుకుపోతామన్న భయంతోనే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చింది. తెలంగాణ పై కాంగ్రెస్‌కు ఎన్నడూ నిజమైన ప్రేమ లేదు. సోనియా గాంధీ ఆత్మకథలో తెలంగాణ ప్రస్తావన లేకపోవడం.. కాంగ్రెస్ ప్రచారంలోని డొల్లతనాన్ని బయటపెట్టింది. తెలంగాణ చరిత్రను కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకోవాలని చూడటం సిగ్గుచేటు' అంటూ కేటీఆర్ కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. పీవీ నరసింహారావు కూతురు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వాణీదేవి.. సోనియాగాంధీ ఆత్మకథపై విమర్శలు గుప్పించారు. 'పీవీపై అంత ప్రేమ ఉంటే ఆయన అంత్యక్రియలను ఢిల్లీలో ఎందుకు నిర్వహించలేదు. తెలంగాణ నాయకత్వం, ప్రజల పట్ల సోనియా గాంధీకి, కాంగ్రెస్ పార్టీకి ఎన్నడూ నిజమైన అభిమానం లేదు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ ఎప్పుడూ రాజకీయ అవసరాల కోణంలోనే చూసింది. తెలంగాణ సాధనలో ప్రజల త్యాగాలను, కేసీఆర్ నాయకత్వాన్ని విస్మరించే ప్రయత్నం చేస్తూ అబద్దాలను ప్రచారం చేస్తోంది. కోట్లాది తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, పోరాటాలు, కేసీఆర్ నాయకత్వంలోని ఉద్యమ ఫలితమే స్వరాష్ట్రం.

కాంగ్రెస్ మేనిఫెస్టోను మోసాల చిట్టాగా అభివర్ణించిన హరీశ్‌రావు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత టి.హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సరిగ్గా మూడేళ్ల క్రితం విడుదల చేసిన మేనిఫెస్టోను మోసాల చిట్టాగా మార్చేశారని 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు. ప్రజలకు అండగా ఉంటామని చెప్పిన 'అభయహస్తం' కాస్తా, నేడు ప్రజలకు ఏమీ ఇవ్వని 'మొండిహస్తం', 'శూన్యహస్తం'గా మారిపోయిందని ఎద్దేవా చేశారు. మల్లికార్జున ఖర్గే సమక్షంలో మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్ వంటి పవిత్ర గ్రంథాలతో సమానంగా భావించి ప్రతి హామీని అమలు చేస్తామని నాడు రేవంత్ రెడ్డి ప్రమాణం చేశారని హరీశ్‌రావు అన్నారు. మూడేళ్లు గడిచినా ఒక్క హామీ కూడా నెరవేరలేదని ఆరోపించారు. ఓట్లేసిన ప్రజలనే కాకుండా ప్రమాణం చేసిన పవిత్ర గ్రంథాలను కూడా కాంగ్రెస్ మోసం చేసిందని దుయ్యబట్టారు. గాంధీభవన్‌లో ఇచ్చిన మాటను ఎందుకు నిలబెట్టుకోలేకపోయారో రేవంత్ రెడ్డి, ఖర్గే, శ్రీధర్ బాబు, భట్టి విక్రమార్క ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తొలి మంత్రివర్గ సమావేశంలోనే 'ఆరు గ్యారెంటీ'లకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్, ఇప్పటివరకు 38 క్యాబినెట్ భేటీలు నిర్వహించినా ఎందుకు ఆ పని చేయలేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను నట్టేట ముంచారని విమర్శించారు.హామీలను ఎగ్గొట్టి ప్రజలను వంచించడమే కాంగ్రెస్ ఏకైక విజయమని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ మోసపూరిత విధానాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా జర్నలిస్టుల భద్రతకు టీజేపీ డిమాండ్

హైదరాబాద్:

జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా, తెలంగాణ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బుద్ధ భవన్‌లో ఉన్న రాష్ట్ర కార్యాలయంలో ఈ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యుడు, టీజేపీ సలహా కమిటీ చైర్మన్ ఉప్పల లక్ష్మణ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, జర్నలిస్టులందరికీ జాతీయ పత్రికా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ (తెహల్కా దినపత్రిక ఎడిటర్) కె. చంద్రశేఖర్‌ను ప్రత్యేక పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యానికి నాలుగవ స్తంభంగా పరిగణించబడే పాత్రికేయ రంగం, ప్రజలకు మరియు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ నిరంతరం ప్రజా సంక్షేమం కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. టీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.వి. రమణారావు మాట్లాడుతూ, 1966లో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏర్పాటైన తర్వాత, జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన స్వేచ్ఛ మరియు వారి భద్రతకు మరింత ప్రాధాన్యత లభించిందని తెలిపారు. ప్రతి ఏటా జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా, పాత్రికేయ రంగంలో విశేష సేవలు అందించిన జర్నలిస్టులను గుర్తించి, వారిని పురస్కారాలతో సత్కరిస్తున్నామని ఆయన చెప్పారు. టీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఆర్. గోరి మాట్లాడుతూ, జర్నలిస్టులు



ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం పోరాడుతోందని, వారి హక్కులను, సంక్షేమాన్ని కాపాడేందుకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజేపీ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ ఖలీల్, ఉపాధ్యక్షులు మహమ్మద్ ఖాసీం, రాణా ప్రతాప్, సత్నామ్ సింగ్, ఎం.ఏ. ఖదీర్, షేక్ అమీర్ హుస్సేన్, ఎం.ఏ. రఫీఉద్దీన్, మీర్ మహమ్మద్ అలీ, ఎం.ఏ. రఫీక్ తదితరులు పాల్గొని, జర్నలిస్టులందరికీ హృదయపూర్వక జాతీయ పత్రికా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజల ఆశీర్వాదమే నా బలం: మంత్రి సీతక్క

గోవిందరావుపేట మండల కేంద్రంలో నిర్వహించిన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఒకప్పుడు ప్రజాయుద్ధంలో తుపాకీ చేతబట్టి ప్రజల హక్కుల కోసం, వారి సంక్షేమం కోసం పోరాటం చేశానని, నేడు ప్రజల ఆశీర్వాదంతో అసెంబ్లీకి వెళ్లి మంత్రిగా ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందని పేర్కొన్నారు. తన జీవితంలో వచ్చిన ఈ మార్పు, రాజకీయంగా తాను ఎదిగిన స్థానం అంతా ప్రజలు అందించిన ఆదరణ, ఆశీర్వాదం వల్లే సాధ్యమైందని భావోద్వేగంతో తెలిపారు. నాడు పోరాట మార్గంలో ఉన్నా.. ప్రజాప్రతినిధిగా బాధ్యతలు నిర్వహిస్తున్నా తన లక్ష్యం మాత్రం ఒక్కటేనని, ప్రజల పక్షాన నిలబడటం, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడమే తన ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు.

అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు..

ప్రజల సంక్షేమమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. సమాజంలోని అర్హులైన పేద ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వ పథకాల ద్వారా అండగా నిలవడమే లక్ష్యమని తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ ఏ ఒక్క పేద కుటుంబం కూడా సంక్షేమ ఫలాలకు దూరం కాకూడదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. నూతన పింఛన్ల పంపిణీ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు వారి జీవనానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని అన్నారు. ప్రజలు తన పై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రతి ఒక్కరి సమస్యను తన సమస్యగా భావించి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

ఎన్విడియాలో 62 మిలియన్ డాలర్ల విలువైన షేర్లు కలిగి ఉన్న ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ప్రముఖ చిప్ మేకర్ కంపెనీ ఎన్విడియాలో భారీగా షేర్లు ఉన్నట్లు వెలుగులోకి రావడం సంచలనం సృష్టిస్తోంది. 2026 ఆగస్టు చివరి నాటికి ఆయనకు ఈ కంపెనీలో 13 మిలియన్ల డాలర్ల నుంచి 62 మిలియన్ల డాలర్ల (సుమారు రూ. 121 కోట్ల నుంచి రూ. 579 కోట్ల) విలువైన షేర్లు ఉన్నాయని 'ది వాషింగ్టన్ పోస్ట్' తన నివేదికలో పేర్కొంది. ట్రంప్ ప్రభుత్వానికి, ఎన్విడియా కంపెనీకి మధ్య సంబంధాలపై అనుమానాలు పెరుగుతున్న సమయంలో ఈ వివరాలు బయటకు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ట్రంప్ ఆర్థిక లావాదేవీల పత్రాలను సమీక్షించిన తర్వాత ఈ నివేదికను రూపొందించారు. 2024 చివరి నాటికి ట్రంప్ పేరిట ఎన్విడియాలో ఉన్న షేర్ల విలువ కేవలం 615,000 డాలర్ల నుంచి 1.3 మిలియన్ డాలర్ల మధ్య ఉండేది. కానీ, 2026 ఆగస్టు నాటికి ఆ విలువ ఏకంగా 13 మిలియన్ డాలర్ల నుంచి 62 మిలియన్ డాలర్లకు పెరిగింది. ఈ రెండేళ్లలో ఆయన పెట్టుబడి ఊహించని రీతిలో పెరిగినట్లు స్పష్టమవుతోంది. అయితే, ఆగస్టు తర్వాత రెండు నెలల కాలంలో జరిగిన స్టాక్ ట్రేడింగ్ వివరాలు ఈ పత్రాల్లో లేవని, వాటి వెల్లడికి కొంత సమయం పడుతుందని నివేదిక పేర్కొంది. ఒకవైపు ఈ వివాదాలు నడుస్తుండగానే, ఎన్విడియాతో పాటు మరో రెండు డజన్ల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కంపెనీలను 'నేషనల్ ఛాంపియన్స్'గా ప్రకటించేందుకు ట్రంప్ ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' కథనం ప్రచురించింది. అమెరికా సాంకేతిక, ఆర్థిక ప్రయోజనాలకు ఈ కంపెనీలు వ్యూహాత్మకంగా ముఖ్యమైనవని గుర్తించడమే ఈ హోదా ఉద్దేశం. ట్రంప్ ప్రభుత్వంతో ఎన్విడియా సంబంధాలు ఇటీవలి కాలంలో తీవ్రంగా పరిశీలనకు గురవుతున్నాయి. ముఖ్యంగా అధునాతన ఏఐ చిప్‌ల పై అమెరికా విధానం, వాటిని చైనా పొందకుండా నిరోధించడం వంటి అంశాల్లో ఈ పరిశీలన జరుగుతోంది. మరోవైపు, కంపెనీ సహ వ్యవస్థాపకుడు జెన్సన్ హువాంగ్ సిలికాన్ వ్యాలీలో ట్రంప్‌కు అత్యంత సన్నిహితుల్లో ఒకరిగా పేరుంది. వీరిద్దరి మధ్య 2025 నుంచే మంచి సంబంధాలున్నాయి. ఈ పరిణామాల మధ్య, ఎన్విడియా తన త్రైమాసిక ఆర్థిక ఫలితాలను నేడు ప్రకటించనుంది. ఏఐ చిప్‌లకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో ఈ ఫలితాలపై పెట్టుబడిదారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

భారత్ అభివృద్ధి, ఆసియాన్ శ్రేయస్సు ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయన్న మోదీ

భారత్ అభివృద్ధి, ఆసియాన్ దేశాల శ్రేయస్సు ఒకదానితో ఒకటి గాఢంగా ముడిపడి ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇరుపక్షాల భవిష్యత్తును పోటీతత్వం కాకుండా సహకారం నిర్దేశించాలని ఆయన పిలుపునిచ్చారు. మనీలాలో జరిగిన 23వ ఇండియా-ఆసియాన్ సదస్సులో మోదీ ప్రసంగించారు. భారత్, ఆసియాన్ దేశాలు కలిస్తే ప్రపంచ జనాభాలో దాదాపు నాలుగో వంతు ఉంటాయని మోదీ గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో మన భవిష్యత్తును పోటీతో కాకుండా సహకారంతో తీర్చిదిద్దుకోవడం చాలా అవసరమన్నారు. రాబోయే సంవత్సరాల్లో 'వికసిత భారత్ 2047', 'ఆసియాన్ కమ్యూనిటీ విజన్ 2045' మన ఉమ్మడి ఆకాంక్షలను సాకారం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా తమ 'యాక్ట్ ఈస్ట్' విధానం భారత్-ఆసియాన్ సంబంధాలకు కొత్త ఊపునిచ్చిందని మోదీ తెలిపారు. తమ భాగస్వామ్యం కేవలం సాంస్కృతిక వారసత్వానికే పరిమితం కాకుండా, డిజిటల్, రక్షణ, అంతరిక్షం వంటి కొత్త రంగాల్లోకి విస్తరిస్తోందని వివరించారు. 2014 నుంచి ప్రజా సంబంధాలను బలోపేతం చేసేందుకు 100కు పైగా కార్యక్రమాలు చేపట్టామని, 250 క్విక్ ఇంపాక్ట్ ప్రాజెక్టులు ప్రారంభించామని, 10,000కు పైగా స్కిల్ బిల్డింగ్ స్కాలర్‌షిప్‌లు అందించామని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచం అనేక సంక్షోభాలను ఎదుర్కొంటోందని, శాంతి, స్థిరత్వం గతంలో కంటే ఇప్పుడు ఎంతో అవసరమని మోదీ అన్నారు. ఈ సందర్భంగా, సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ రొమాల్డెజ్ మార్కోస్ జూనియర్‌కు మోదీ అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.

సంపాదకీయం

పిల్లల పెంపకం వృత్తి ఎందుకు కాదు?



వృత్తి అనేది ప్రతి వ్యక్తి జీవితంలోనూ చాలా ముఖ్యమైన భాగం. దాదాపు వృత్తులేవీ సమాజం మొత్తం చేపట్టేవి కాదు. అయితే సమాజం మొత్తంగా చేపట్టే, పాల్గొనే ఒక వృత్తిని, ఆ సమాజ దిశ దశలనే నిర్ణయించే కీలకమైన వృత్తిని, మనం అసలు వృత్తిగానే పరిగణించం-- అదే పిల్లల పెంపకం. పిల్లల పెంపకాన్ని మనం వ్యక్తిగత విషయంగా పరిగణిస్తాం. సమాజం మీద దీని ప్రభావ తీవ్రతను పరిగణనలోకి తీసుకోం. దీనికి ఎటువంటి అధికారిక శిక్షణా లేదు.పిల్లలను పెంచడం అంటే వారి శారీరక, మానసిక, నైతిక అభివృద్ధికి తోడ్పడడం. ఒక కొత్త తరాన్ని పెంచి సమాజానికి అందించడం. ఆ విధంగా గత, వర్తమానాల్ని భవిష్యత్తు వైపు నడిపించడం. సమాజ భవిష్యత్తును నిర్మించడం. దీనికి చదువు, సంస్కారం కావాలి. అందుకే భాస్కర శతకంలో 'చదువది ఎంత కల్గిన రసజ్ఞత ఇంచుక చాలకున్న ఆ చదువు నిరర్థకంబు' అన్నాడు. చదువు కంటే సంస్కారం మిన్న. చదువు మానవత్వాన్ని ప్రసాదిస్తుందని హామీ లేదు. సంస్కారం మాత్రం మనిషిని 'సంఘజీవి'గా మారుస్తుంది. మానవత్వానికి పెద్దపీట వేస్తుంది. ఈ సంస్కారమనే శాస్త్రాన్ని ఇంటి నుంచే అభ్యసించాలి. తల్లిదండ్రుల పెంపకం మీదే పిల్లల ప్రవర్తన ప్రధానంగా ఆధారపడి ఉంటుంది కాబట్టే, తల్లిదండ్రులను ఆదిగురువులు అన్నారు. పిల్లలు తల్లిదండ్రులు చెప్పిన దానికంటే వాళ్ళు చేస్తున్న దానినే ఎక్కువగా ఆచరిస్తారు. కాబట్టి పిల్లల సమక్షంలో తల్లిదండ్రుల కర్మాచరణ, సంభాషణలు ఆదర్శ ప్రాయంగా ఉండాలి. తైత్తిరీయ ఉపనిషత్తులో 'మాతృ దేవోభవ, పితృ దేవోభవ, ఆచార్య దేవోభవ' అన్నారు. ఇది పూజనీయక్రమాన్నే కాదు, పిల్లలు నేర్చుకునే క్రమాన్ని కూడా సూచిస్తుంది.పిల్లల పెంపకం అనే పనికి ఆదాయం ఉండదని, ఎటువంటి జీతం రాదని, ఇది కుటుంబ సహజ బాధ్యత కాబట్టి దీనిని వృత్తిగా పరిగణించలేమని ఎవరైనా వాదించవచ్చు. కాని ఇక్కడ అర్థం చేసుకోవలసింది ఈ పెంపకం ఫలితాలు ఒక్క కుటుంబానికే కాదు, మొత్తం సమాజానికి వివిధ రూపాలలో అందుతుంది. ఈ ఆదాయాన్ని లెక్కకట్టడం కూడా కష్టతరమైన పనే. ఈ ఆదాయం సంపద రూపంలోనే గాక, క్రమశిక్షణ, నీతి, నిబద్ధత, సమర్థత, దేశభక్తి లాంటి వివిధ రూపాలలో సమాజానికి అందుతుంది. అయితే ఇవి దీర్ఘకాలిక ఫలితాలు. పెంపకం మీద వెచ్చించే సమయం, ఖర్చులు మొదలైనవి దీర్ఘకాలిక పెట్టుబడులు. అదేవిధంగా చాలామంది దీన్ని తల్లిదండ్రుల బాధ్యతగా పరిగణిస్తారు. అది కూడా సరైన అభిప్రాయం కాదని నా ఉద్దేశం. ఆ పిల్లలు పెరిగి ప్రయోజకులైన తరువాత వారి సేవలు ఒక్క కుటుంబానికే పరిమితం కావు, దేశం మొత్తానికీ సంపదలే. అదేవిధంగా వారి పెంపకం సరైన రీతిలో లేక చెడుమార్గంలో పయనిస్తే వారు ఆ కుటుంబానికే కాదు ఆ దేశానికే భారంగా మారతారు. ఇప్పటికే మనం దావూద్ ఇబ్రహీం, లారెన్స్ బిష్ణోయ్ లాంటి వాళ్ళ వలన దేశానికి ఎంత నష్టమో, వారు ఈ సమాజానికి ఎంత అపకీర్తిని తెస్తున్నారో చూస్తున్నాం. మరోవైపు నరేంద్ర మోదీ, వెంకటరామన్ రామకృష్ణన్, అమర్త్యసేన్, సి.ఎన్. ఆర్. రావు, టెండూల్కర్, సత్య నాదెళ్ళ, సుందర్ పిచ్చాయ్ లాంటి వాళ్ళనూ చూస్తున్నాం. కాబట్టి, పిల్లలు ఒక్క కుటుంబం సొత్తు కాదు. వారు దేశానికే ఆస్తులు. వారి పెంపకం బాధ్యత ఒక్క కుటుంబానిదే కాదు, సమాజానిది కూడా. ప్రభుత్వం కూడా ఈ విషయంలో దూరంగా ఉండ కూడదు. తగిన చర్యలు, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లల పెంపకాన్ని వృత్తిగా భావించినప్పుడే అది వీలవుతుంది.పిల్లల పెంఎ కాన్ని వృత్తిగా పరిగణించి ప్రభుత్వం దానికి వృత్తిపరమైన నియమావళిని తయారుచేయాలి. దాని పర్యవేక్షణకు, సంప్రదింపులకు మండల వారీగా కొందరు అధికారులను నియమించాలి. ప్రభుత్వం ఒక సలహాదారుగా, మద్దతుదారుగా ఉంటూ అవసరమైన సహాయాన్ని కుటుంబాలకు అందించాలి. ఏ విధంగా అయితే జనాభా నియంత్రణ నుంచి జనాభా సంరక్షణ కోసం జనాభా నిర్వహణా విధానాన్ని ఈ మార్చిలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే మొట్టమొదటి సారిగా విడుదల చేసిందో, అదేవిధంగా పిల్లల పెంపకం కోసం కూడా ఒక ప్రభుత్వ విధానాన్ని రూపొందించాలి. అలా దేశానికే ఈ విషయంలో మనం మార్గదర్శిగా నిలవాలి.పిల్లల పెంపకం అంశంలో డెన్మార్క్, స్వీడన్, నార్వే లాంటి స్కాండినేవియన్ దేశాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయి. అయితే ఈ దేశాలు పిల్లల పెంపకంలో అమలుపరచే విధానాలన్నీ మన ప్రాచీన గ్రంథాలలో కొన్ని వేల ఏళ్ళ క్రితం పొందుపరిచినవే. ఉదాహరణకు 7--7--7 పేరెంటింగ్ రూల్ పెంపకం విషయంలో ప్రపంచంలోనే ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. దీని ప్రకారం మొదటి ఏడేళ్ళు ఆటకు, వినోదానికి; రెండో ఏడేళ్ళు (8--14) బోధనకు; మూడో ఏడేళ్ళు (15--21) పెద్దలు పిల్లలకు సలహాదారుగాను ఉండాలి అని చెప్తుంది. దీనినే మన చాణక్య నీతి సూత్రాలు 'రాజవత్ పంచవర్షాణి, దశ వర్షాణి దాసవత్; ప్రాప్తేషు షోడశే వర్షే, పుత్రం మిత్రవ దాచరేత' అని చెప్పాయి.

మాల్యాలలో ఘనంగా యాదవు ల సధర్ వేడుకలు

-పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య.

తెహెల్కా న్యూస్ భువనగిరి 17-11-2026

బొమ్మలరామారం మండలం మాల్యాల గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిం చిన సధర్ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వవిప్,ఆలేరు ఎమ్మె ల్యే బీర్ల ఐలయ్య ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదవ సోదరు లుసంప్రదాయబద్ధంగా నిర్వహిం చిన దున్నపోతుల సయ్యాటాల ను ఎమ్మెల్యే ఆసక్తిగా తిలకిం చారు. అనంతరం అక్కడ ఏర్పా టు చేసిన కార్యక్రమంలో మాట్లా డుతూ.. యాదవుల సంస్కృతి, సంప్రదాయాలకు సధర్ వేడుక లు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొ న్నారు.యాదవుల జీవన విధా నంలో పశుసంపదకు ఎంతో ప్రాధాన్యత ఉందని,తరతరాలు గావస్తున్న ఆచార వ్యవహారాలు సంస్కృతి, సంప్రదాయాలను భా వితరాలకు అందిం చాల్సిన బా ధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇలాం టివేడుకలు కులఐక్యతను సోదరభావాన్ని పెంపొంది ంచడం తో పాటు మన సంస్కృతి,సంప్ర దాయాలను కాపాడేందుకు దోహ దపడతాయని తెలిపారు.సధర్ వేడుకలను ఘనంగా నిర్వహించిన యాదవ సోదరు లను ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అభినందించారు.



చేనేత కార్మికుల అభివృద్ధికి ఆధునిక సాంకేతికత,డిజిటల్ మార్కెటింగ్‌ను వినియోగించుకోవాలి

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి.

తెహెల్కా న్యూస్ భువనగిరి 17-11-2026

నాబార్డ్ సహకారంతో అభివృద్ధి చేసిన సిరిపురం ఇక్కత్ చేనేత క్లస్టర్‌ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి,వెల్లంకి గ్రామంలోసంద ర్శించి చేనేత కార్మికులతో ము ఖాముఖి మాట్లాడారు.నాబార్డ్ గ్రామ్య వికాస్ నిధి కింద మంజూరైన రూ. 26 లక్షల గ్రాంట్ సహాయంతో అమలు చేస్తున్నఈ ప్రాజెకు ట్ద్వారాసిరిపురం,బోగారం వెల్లంకి గ్రామాలకు చెందిన 20 చేనేత కుటుంబాలకు ప్రయోజ నం కలుగు తోందని అధికారులు కలెక్టర్‌కు వివరిం చారు.ఈ సందర్భంగా నాబార్డ్ సహకా రంతో ఏర్పాటు చేసిన 20స్టాండ్ మగ్గాలు,మూడు వార్పింగ్ యం త్రాలు, మూడు ఆసు యంత్రాల ను కలెక్టర్ పరిశీలించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా తొమ్మిది మంది చేనేత కార్మికులకు రూ. 12 లక్షల సంస్థా గత రుణ సదుపాయం కల్పించి నట్లు తెలిపారు. చేనేత ఉత్పత్తు ల ప్రామాణికత,నేత కార్మికుల గుర్తింపు, ఉత్పత్తుల మార్కెట్ ప్రాచుర్యాన్ని పెంచేందుకు ఖశం ష్లు ూ× సహకారంతోరూపొందిం చిన ూ= కోడ్ ఆధారిత 'ఔుఖజవ ూవఅంవ' డిజిటల్ ట్రేసబిలిటీ వ్యవస్థ గురించి వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ.. చేనేత రంగ అభివృద్ధికి నాబార్డ్ అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. చేనేత ఉత్పత్తుల కు విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించే ందుకు ఈ- కామర్స్ వేదికలు,డిజిటల్ మా ర్కెటింగ్ విధానాలను వినియో గించుకోవాలని సూచించారు. మధ్యవర్తులపై ఆధారపడకుండా నేత కార్మికులు తమఉత్పత్తుల ను నేరుగా వినియోగదారులకు విక్ర యించేలా చర్యలు తీసుకో వాలని,తద్వారా కార్మికులకు మెరుగైన ధరలు,ఆదాయం లభి స్తాయని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ సిరిపురం గ్రా మంలోనిచేనేత సహకార సంఘా న్నిసందర్శించి సంఘంఆధ్వర్యం లోతయారు చేస్తున్న వివిధ రకా ల బెడ్‌షీట్లు తదితర చేనేత ఉత్పత్తులను పరిశీలించారు. సంఘం పాలకవర్గ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలు, అవ సరాలనుఅడిగితెలుసుకున్నారు చేనేత కార్మికులు ఎదుర్కొంటు న్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నాబార్డ్ జిల్లా అ భివృద్ధి మేనేజర్ ఝాన్సీ రాణి కాసర్ల మాట్లాడుతూ,చేనేత క్లస్ట ర్‌ను ఈ-కామర్స్ వేదికలతో అనుసంధానం చేయడం ద్వారా ప్రత్యక్ష మార్కెటింగ్ అవకాశాల ను పెంపొందించి,నేత కార్మికుల ఆదాయం,జీవనోపాధిని మెరు గుపరచవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాబార్డ్ డీడీ ఎం ఝాన్సీ రాణిఅదనపు డీఆర్ డీవో జంగారెడ్డి,చేనేత శాఖ అసి స్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, చేనేత సహకార సంఘం అధ్యక్షులు షణ్ముఖం, సంఘం పాలకవర్గ సభ్యులు,ూూూ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు,చేనేత కార్మికు లు పాల్గొన్నారు.



తెలంగాణలో దయనీయ స్థితిలో వైద్య వ్యవస్థ

-ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెరిగిపోతున్న ఆరోగ్యశ్రీ బకాయిలు

(హైదరాబాద్ నవంబర్ 17 తెహెల్కా న్యూస్ ప్రతినిధి సాగర్)

మూడేళ్లుగా రూ.800 కోట్లు పెండింగ్, రెగ్యులర్‌గా వచ్చే నిధులూ రాక సర్జరీలు బంద్ ఆసుపత్రుల నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సూపరింటెండెంట్లు రాష్ట్రంలోని ప్రభుత్వ బోధనా స్పత్రుల్లో ఆరోగ్యశ్రీ నిధులతో పాటు, రెగ్యులర్‌గా రావాల్సిన నిధులు పెండింగ్‌లో ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సూపరింటెండెంట్లు తెలంగాణ వైద్యవిద్య సంచాలకుల పరిధిలోని 35 బోధనాస్పత్రులు, మరో 12 ప్రభుత్వ ఆసుపత్రులు, టీవీవీపీ పరిధిలోని 180కి పైగా ఆసుపత్రుల్లో మూడేళ్లుగా ఆరోగ్యశ్రీ నిధులు నిలిచిపోవడంతో ఆగిపోయిన శస్త్రచికిత్సలు ఉస్మానియా ఆసుపత్రికి రూ.173.80 కోట్లు, గాంధీ ఆసుపత్రికి రూ.54 కోట్లు, నిలోఫర్ ఆసుపత్రికి రూ.40 కోట్లు, సరోజినీ కంటి ఆసుపత్రికి రూ.14 కోట్లు, ఈఎన్‌టీ ఆసు పత్రికి రూ.11 కోట్లు, పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి రూ.3 కోట్లు, కింగ్ కోఠి ఆసుపత్రికి రూ.4.6 కోట్లు, బాన్సువాడ ఆసుపత్రికి రూ.2.5 కోట్లు, మహబూ బ్‌నగర్ ఆసుపత్రికి రూ.10 కోట్లు, మొత్తంగా అన్ని ఆసుపత్రులు కలిపి దాదాపు రూ.800 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్టు చెబుతున్న వైద్యాధి కారులు ఇక ఉద్యోగుల ఆరోగ్య పథకం కింద రూ.76.67 కోట్లు, ఈహెచ్ఎస్ బకాయిలు రూ.23.85 కోట్లు ఉన్నట్టు సమాచారం హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఫండ్ అంశంలో కలెక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉస్మాని యా ఆసుపత్రిలో వెంటిలేటర్లు రిపేర్‌కు వచ్చాయని, కొన్ని ఆసుపత్రుల్లో స్కానింగ్ పరికరాలు చెడిపో యాయని, మరికొన్ని ఆసుపత్రుల్లో మరుగుదొడ్ల నిర్వ హణకు కూడా డబ్బులు లేవని వైద్యాధికారుల ఆందోళన వెంటనే ఆరోగ్యశ్రీతో పాటు రెగ్యులర్‌గా వచ్చే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్న సూపరింటెండెంట్లు.

పెన్షన్ ప్రొసీడింగ్ కార్డుల పంపిణీలో రాజకీయ రగడ

-రేణుక గార్డెన్స్‌లో పల్లా రాజేశ్వర్ రెడ్డి -- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం!

-లబ్ధిదారుల కార్యక్రమంలో నేతల మధ్య మాటల యుద్ధం.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై ఎంపీ చామల నిలదీత.. ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోయిన పల్లా!

(జనగామ నవంబర్ 17తెహెల్కా న్యూస్ ప్రతినిధి సాగర్)

చేర్యాల పట్టణంలోని రేణుక గార్డెన్స్‌లో నిర్వహించిన పెన్షన్ ప్రొసీడింగ్ కార్డుల పంపిణీ కార్యక్రమం రాజకీయ రసాభాసకు వేదికగా మారింది. పేదలకు అందించాల్సిన సంక్షేమ పథకాల కార్యక్రమంలో అనూహ్యంగా రాజకీయ వేడి రాజుకుంది. మాజీ బీఆర్ఎస్ ప్రభుత్వ నేత, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనను ప్రస్తావిస్తూ పల్లా రాజేశ్వర్ రెడ్డిపై ప్రశ్నల వర్షం కురిపించారు. గత ప్రభుత్వ హయాంలో చోటుచేసు కున్నాయని ఆరోపణలు ఎదుర్కొన్న అవినీతి, అక్రమాలపై ప్రశ్నిస్తూ నిలదీశారు. గత పాలనలో జరిగిన పరి ణామాలకు సంబంధించి సమాధానం చెప్పా లని ప్రశ్నించినట్లు తెలుస్తోంది.అయితే ఎంపీ స్పందిం చిన ప్రశ్నలకు పల్లా రాజేశ్వర్ రెడ్డి నుంచి స్పష్టమైన సమాధానం రాకపోవడంతో ఇరువురి మధ్య వాగ్వాదం తీవ్రరూపం దాల్చినట్లు సమాచారం. దీంతో కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారుల దృష్టి ఒక్కసారిగా నేతల మధ్య జరుగుతున్న మాటల యుద్ధంపై పడింది. సంక్షేమ పథకాల అమలు, గత ప్రభుత్వ పాలనలో జరిగిన పరిణామాలు, అవినీతి ఆరోపణలు వంటి అంశాలు ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి. పెన్షన్ ప్రొసీడింగ్ కార్డుల పంపిణీ కార్యక్రమం కాస్తా రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలతో వేడెక్కింది. లబ్ధిదారు లకు పెన్షన్ కార్డులు అందించే వేదికపై రాజకీయ రగడ చోటుచేసుకోవడం చేర్యాల రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. సంక్షేమ కార్యక్రమంలో మొదలైన ఈ మాటల యుద్ధం రాజకీయంగా ఎలాంటి పరిణామాలకు దారితీస్తుం దోనన్న చర్చ సాగుతోంది. అని అన్నారు . ఈ కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ కోమూరి ప్రశాంత్ రెడ్డి మరియు లబ్ధిదారులు కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



ప్రధాని మోడీ ని కించపరిచిన రాహుల్ గాంధీ, ఇటలీ వ్యక్తిపై ఏఫైర్ నమోదు చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సొడ రమేష్

(జనగామ నవంబర్ 17 తెహెల్కా న్యూస్ ప్రతినిధి సాగర్)



జనగామ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ని కించపరిచేలా మాట్లాడిన కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పై ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జనగామ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సొడ రమేష్ ఆధ్వర్యంలో జనగామ డీసీపీ మహేంద్ర నాయక్ ఐపీఎస్ కి పిటిషన్ ఇవ్వడం జరిగింది.ఈ సంద ర్భంగా జిల్లా అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ, మొన్న హైదరాబాద్ లో జరిగిన భారత్ సమ్మిట్ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ , భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ని ఉద్దేశించి అనుచితమైన, కించపరిచే విధంగా మాట్లా డారని అన్నారు. ఆయన మాటలు ప్రధానమంత్రి పరువు ప్రతిష్టలకు భంగం కలిగించే విధంగా ఉండ టమే కాకుండా, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని, ఒక బాధ్యతగల నాయకుడు ఇలా మాట్లాడడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు.

-ఇటలీ వ్యక్తి వ్యాఖ్యలపై అభ్యంతరం

అదే భారత్ సమ్మిట్ లో ఇటలీకి చెందిన జియాకోమో ఫిలిబెక్ (గిఅకౌమో ఫీలిబెక్), సెక్రటరీ జనరల్, పార్టీ ఆఫ్ యూరోపియన్ సోషలిస్ట్స్ (పేస్) అనే వ్యక్తి ఓటు చోరీ జరిగిందని, భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ని కించపరిచే విధంగా లిఓటు చోర్ , గద్డి చ్చోడ్ ఓటు దొంగ కుర్చీ దిగు అని మాట్లాడారని అన్నారు. ఒక విదేశీయుడు భారతదేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుని, భారత ప్రధాన మంత్రిని అవమానించడం సరికాదని, అతనికి వేదిక కల్పించిన రాహుల్ గాంధీ పై, అలాగే ఫిలిబెక్ పై ఫారినర్స్ యాక్ట్, వీసా నిబంధనల ఉల్లంఘన, బన్స్ సంబంధిత సెక్షన్ల కింద ఫైర్ నమోదు చేసి చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని డీసీపీ గారిని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఉడుగుల రమేష్, శివరాజ్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల మారాణి, బీజేపీ జిల్లా ఎన్నికల అధికార ప్రతినిధి పెద్దోజు జగదీష్, వివిధ మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నషా ముక్త్ యువ మాదకద్రవ్యాల నివారణపై రాష్ట్రస్థాయి శిక్షణా కార్యక్రమం

హైదరాబాద్, నవంబర్ 17, తెహెల్కా న్యూస్;



ప్రతి పాఠశాలను మాదకద్రవ్య రహిత విద్యా ప్రాం గణంగా తీర్చిదిద్దాలి నషా ముక్త్ భారత్ కార్యక్రమ ంలో భాగంగా తెలంగాణ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో 'నషా ముక్త్ యువ' పేరిట మాదకద్ర వ్యాల వినియోగ నివారణపై ఒకరోజు రాష్ట్రస్థాయి శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఎస్సీఈఆర్టీ ప్రాంగణంలోని గోదావరి హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి సీఎంఓలు, డీఎస్ఓలు, రిసోర్స్ పర్సన్లు, విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా నోడల్ అధికారులు, రిసోర్స్ పర్సన్ల సామర్థ్యాలను పెంపొందించి, పాఠశాల స్థాయిలో అవగాహన కార్యక్రమాలను విస్తరించడం ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశం. ఈ సందర్భంగా పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు డా. ఇ. నవీన్ నికోలస్, ఐఏఎస్, మాదకద్రవ్యాల నివారణకు సంబంధించిన వార్షిక కార్యాచరణ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పాఠశా లల్లో ఏడాది పొడవునా అవగాహన, నివారణ కార్యక్రమాలను క్రమబద్ధంగా నిర్వహించేందుకు ఈ క్యాలెండర్ దిశానిర్దేశం చేస్తుంది. ప్రారంభ సమావేశంలో సమగ్ర శిక్ష సంయుక్త సంచాలకులు శ్రీ పి. మదన్ మోహన్ మాట్లాడుతూ, విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను నిశితంగా గమ నిస్తూ, పాఠశాల స్థాయిలో సూక్ష్మ పరిశీలన, పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరాన్ని వివరించారు. సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, విద్యార్థులకు సకాలంలో మార్గదర్శనం, తగిన సహకారం అందించాలని సూచించారు. రాష్ట్రస్థాయి శిక్షణలో పాల్గొన్న అధికారులు, రిసోర్స్ పర్సన్లు తమ జిల్లాల్లో తదుపరి శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన కోరారు. ప్రతి పాఠశాలను మాదకద్రవ్య రహిత విద్యా ప్రాంగణంగా తీర్చిదిద్దేందుకు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. శిక్షణలో భాగంగా ఈగల్ ఫోర్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ పి. శ్రీనివాసరావు, టెలీ-మానస్ సైకాలజిస్టు, కౌన్సెలర్ శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ, సమగ్ర శిక్ష ప్రతినిధులు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వినియోగ నివారణ, కౌమారదశలో ఎదురయ్యే ఒత్తిళ్లు, మానసిక ఆరోగ్యం, కౌన్సెలింగ్ ప్రాధాన్యం, విద్యార్థు లకు సకాలంలో సహాయం అందించడంలో పాఠశాలల పాత్రపై శిక్షణా తరగతులు నిర్వహించారు

కూకట్‌పల్లిలో 4,092 మందికి కొత్త పెన్షన్లు అర్హులైన పేదలకు ఆర్థిక భరోసా

కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం శేరి సతీష్ రెడ్డి

కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ నవంబర్ 17



ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతో ందని శేరి సతీష్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో కొత్తగా 4,092 మంది లబ్ధిదారులు పెన్షన్లకు ఎంపికయ్యారని వెల్లడిం చారు. సర్కిళ్ల వారీగా కూకట్‌పల్లిలో 705 మంది, మూసాపేటలో 2,179 మంది, ఓల్డ్ బోయిన్‌పల్లిలో 1,208 మంది చొప్పున మొత్తం 4,092 మంది ఎంపికైనట్లు ఆయన వివరించారు. వృద్ధులు, దివ్యాం గులు, వితంతువులు తదితర అర్హులైన నిరుపేదలకు పెన్షన్ల ద్వారా ఆర్థిక తోడ్పాటు అందించి, వారి రోజువారీ అవసరాలకు అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, పాల్గొన్నారని తెలిపారు. వీరితోపాటు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, ఏ బ్లాక్ అధ్యక్షులు పట్లోళ్ల నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, మరియు పీసీసీ నాయకులు, నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నా రని వివరించారు. అర్హులైన పేద కుటుంబాలకు రేషన్ కార్డుల మంజూరుతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రజలకు చేరువ చేయడం పైనా ప్రజా ప్రభుత్వం దృష్టి సారిస్తోందని శేరి సతీష్ రెడ్డి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించే ందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. "పేదల సంక్షేమం... అర్హులకు భరోసా... ఇదే ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యం" అని శేరి సతీష్ రెడ్డి అన్నారు.

అంబీర్ చెరువు నీటి విడుదలను వెంటనే నిలిపివేయాలి ఎర్రబెల్లి సతీష్ రావు

కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ నవంబర్ 17



అంబీర్ చెరువు మత్తడిని దెబ్బతీసి నీటిని నాలాలోకి విడుదల చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. నీటి విడుదలను వెంటనే నిలిపివేసి, చెరువులో నీటి నిల్వను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ సమయంలో చెరువును ఖాళీ చేయడం వల్ల పరిసర కాలనీల్లో భూగర్భజలాలు తగ్గి, బోర్లలో నీటి లభ్యతపై ప్రభావం పడే ప్రమాదముందని పేర్కొన్నారు. ఇప్పటికే నీటి ట్యాంకర్లు దొరక్క ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని, నీటి అవసరాలు ఎక్కువగా ఉన్న సమయం లో చెరువు నీటిని వదిలేయడం సరికాదన్నారు. అభివృద్ధి పనులను స్వాగతిస్తున్నామని, అయితే ప్రజల నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టాలని కోరారు. మత్తడిని దెబ్బతీసి నీటిని విడుదల చేయాల్సిన అవసరం ఏమిటో అధికారులు వివరించాలని, పునర్నిర్మాణ ప్రణాళికను, పనులు పూర్తిచేసే గడువును వెల్లడించాలని కోరారు. సంబం ధిత అధికారులు వెంటనే పరిశీలించి, నీటి విడుదల ను నిలిపివేసి, మత్తడి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. "అభివృద్ధితో పాటు చెరువు నీటిని కాపాడాలి---ప్రజల నీటి అవసరా లకు భరోసా ఇవ్వాలి!" అని సతీష్ రావు పేర్కొన్నారు.

శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్స వాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య.



తెహెల్కా న్యూస్ భువనగిరి 17-11-2026

యాదాద్రి భువనగిరి జిల్లా భువ నగిరి మున్సిపాలిటీ పరిధిలో కొలువైన శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అమ్మవారి కళ్యాణ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయి లయ్య పాల్గొన్నారు.ఈసందర్భంగా ఆలయానికి చేరు కున్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కి ఆలయ కమిటీ సభ్యులు,భక్తు లు ఘన స్వాగతం పలికారు. శ్రీ రేణుకఎల్లమ్మ తల్లిని దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు.అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసం తోషాలతో ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యా లతో వర్ధిల్లాలని ఆకాంక్షిం చారు. భక్తిశ్రద్ధలతోనిర్వహించిన అమ్మ వారి కళ్యాణ వేడుకల్లో పాల్గొని భక్తులతో కలిసి ఆధ్యాత్మిక వాతావరణంలో గడిపారు.

పట్టణంలో నూతన మొబైల్ షోరూమ్ ప్రారంభించిన చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్.



తెహెల్కా న్యూస్ భువనగిరి 17-11-2026



పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రమీల మొబైల్ షోరూమ్ ను భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగాళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ ఘనంగా ప్రారంభించారు.జ్యోతి ప్రజ్వలన చేసి,రిబ్బన్ కట్ చేసి షోరూమ్ ప్రారంభించారు. అనంతరం షోరూమ్ లోని మొబై ల్స్ నుపరిశీలించి,యాజమాన్యా నికి శు భాకాంక్షలు తెలిపారు.అనంతరం చైర్మన్ దంపతులను ఘనంగాస న్మానించడం జరిగింది షోరూమ్ యాజ మాన్యం,పూల మాలలు వేసి శాలువాలతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ తంగాళ్ళ పల్లి శ్రీవాణి రవికుమార్ మాట్లా డుతూ... భువనగిరి పట్టణం రోజురోజుకూ అభివృద్ధి చెందు తోందని, ఇలాంటి నూతన వ్యాపా రాలు యువతకు ఉపాధి కల్పిం చడంతో పాటు ప్రజలకు మెరుగై న సేవలుఅందిస్తాయనిఅన్నారు షోరూమ్ యజమాని వ్యాపారం లో మరింత అభివృద్ధి సాధించా లని ఆకాంక్షించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు,వ్యాపారస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజ లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేలి శ్రీనివాస్ రెడ్డి ఇంటిలో భోజనం చేసిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు.



తెహెల్కా న్యూస్ భువనగిరి 17-11-2026

బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేలి శ్రీనివాస్ రెడ్డి ఇంటికిమెద క్ ఎంపీ రఘునందన్ రావు విచ్చే సి భోజనం చేయడం జరిగింది. అనంతరం స్థానిక సమస్యలపై తెలుసుకోవడం ఎస్ ఐ ఆర్ గు రించి వివరించడం జరిగింది. ఈ సందర్భంగా నాగేల్లి శ్రీనివాస రెడ్డి ఇంటికి బిజెపి నాయకులు జిల్లా అధ్యక్షులు ముట్కురి అశో క్ గౌడ్ పాశం భాస్కర్ గూడూరు నారాయణరెడ్డి నవరత్నం రెడ్డి పట్నం శ్రీనివాస్,చందా మహేంద ర్ గుప్తా,రత్నపురం బలరాం, బెల్లంకొండ కిరణ్, బెల్లంకొండ ఉపేందర్,ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కానుకుంట్ల రమేష్ కోటి మేడి కోటేష్ రాము, ఎరుపుల శివ శ్రీశైలం పట్నం దిలీప్ పాశం అక్షిత్ ఉదగిరి అక్షిత్ సురేష్ రెడ్డి బాల్ శంకర్ రావుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

-ఏఐటీయూ సీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్.

తెహెల్కా న్యూస్ భువనగిరి 17-11-2026



గిగ్ వర్కర్ల మాదిరిగానే ఆటో డ్రైవర్ల కోసం సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేసి,అధికారం లోకి రాకముందు ఆటో డ్రైవర్ల కు సంవత్సరానికి 12,000 ఇస్తా మని చెప్పిన హామీని వెంటనే అమలు చేయాలని ఏఐటీయూ సీ రాష్ట్రకార్యదర్శి ఎండీ ఇమ్రాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవా రంభువనగిరి పట్టణం లో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి భువ నగిరి టు ఫుట్కేసర్ రూట్ ఆటో యూనియన్ ఏఐటీయూసీ అను బంధశీ సభ్యుల జనరల్ బాడీ సమావేశానికి ఇమ్రాన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో లక్షలాది మంది ఆటో డ్రైవర్లకు ఎలాంటి భద్రత లేదని, నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం గిగ్ వర్కర్ల కోసం తీసుకొచ్చిన సంక్షే మ బోర్డు మాదిరిగానే ఆటో డ్రై వర్ల కోసం సంక్షేమ ఏర్పాటు చే యాలని,పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు,విడిభాగాల ధరల పెరుగుదల, బ్యాంకు రుణా ల భారం,రోజురోజుకూ తగ్గుతు న్న ఆదాయంతో ఆటో కార్మికుల జీవనం సంక్షోభంలోకి నెట్టివేయ బడిందని ఆవేదన వ్యక్తంచేశారు ఓలా, ఉబెర్,ర్యాపిడో వంటి యా ప్ సంస్థల కారణంగా ఆటో డ్రై వర్లు ఉపాధి కోల్పోతున్న నేప థ్యంలో వాటిని నియంత్రిస్తూ ఆటో కార్మికుల ప్రయోజనాలను కాపాడే విధానాన్ని అమలు చే యాలని,రోడ్డు ప్రమాదాల్లో మర ణించిన ఆటో డ్రైవర్ల కుటుంబా లకు 'ఈ-చలాన్' నిధి ద్వారా తగిన ఆర్థిక సహాయ ంఅందించా లని,వాహన సారథి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న డ్రైవింగ్ లైసె న్స్ సమస్యలను వెంటనే పరిష్క రించాలని,రవాణా వాహనాలకు జి.ఓ.ఎం.ఎస్. నెం.60 ప్రకారం ఫిట్‌నెస్ ఫీజులను తగ్గించాలని, అర్హులైన ఆటో డ్రైవర్లందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి సామల శోభన్ బాబు పాల్గొన్నారు. అనంతరం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.అధ్యక్షు లుగా గనబోయిన వెంకటేష్ ఉపాధ్యక్షులు జి.మోహన్, ఎస్. కె చాంద్,ప్రధాన కార్యదర్శి ఎస్ మల్లేష్,సహాయ కార్యదర్శులు కె.వెంక టేశం,ఎన్.రమేష్ కోశాధి కారి ఆర్ అంజయ్య, కార్యవర్గ సభ్యులుగా బషీర్,పెంటయ్య, మహేష్, శ్రీనివాస్ రెడ్డి లక్ష్మణ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.


బంగారం ధరలు


manepally®
Jewellers Pvt. Ltd.
trusted legacy since 1890
MANEPALLY DIGITAL GOLD APP
Google play App Store
GOLD & SILVER RATES

24 kt	₹	1,36,040	10gms
22 kt	₹	1,24,700	10gms
SILVER	₹	1,75,900	1kg

Contact: 6309 111299 | 99120 10888

అర్హులకే సంక్షేమ పథకాలు చేయూత పథకంతో పేదలకు భరోసా

-గత ప్రభుత్వంలో అధికార పార్టీ వారికే పథకాలు

- ఏఎంసీ చైర్‌పర్సన్ తిరుపతమ్మ

నడిగూడెం: నవంబర్ 17(తెహెల్కా న్యూస్)



ప్రభుత్వ పథకాల అమలులో రాజకీయాలకు తావుల ేకుండా అర్హులైన పేదలందరికీ ప్రాధాన్యమిస్తున్నా మని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఏపూరి తిరుపతమ్మ సుధీర్ తెలిపారు. మంగళవారం నడిగూడెం మండలంలోని కరివిరాల, రత్నవరం గ్రామాల్లో పర్యటించిన ఆమె.. చేయూత పథకం కింద కొత్తగా పింఛన్లు మంజూరైన వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తిరుప తమ్మ మాట్లాడుతూ పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. గత పాలనలో సంక్షేమ పథకాల పంపిణీ అధికార పార్టీకి అనుకూలంగా సాగిందని విమర్శించారు. ప్రస్తుతం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. చేయూత పింఛన్ల మొత్తాన్ని భవిష్యత్తులో రెట్టింపు చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు సహకరించాలని కోరారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన అవకత వకలను ప్రజలు మరచిపోలేదని, రాబోయే రోజుల్లో టీఆర్ఎస్‌కు ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మం డల అధ్యక్షుడు మొక్క బిక్షపతి, జిల్లా కార్యదర్శి, కరివిరాల మాజీ సర్పంచ్ గుర్రం నీలిమ గాంధీ, సర్పంచులు నాగేశ్వరరావు, దున్న శ్రీనివాస్, రాజేష్, సోమయ్య, నాయకులు లింగారెడ్డి, నాగేశ్వరరావు, బడేటి వెంకటేశ్వర్లు, బాణాల నాగరాజు, కాసాని శివకృష్ణ, సోమాగాని రవి, పగడాల ప్రభాకర్ రెడ్డి, పి.విజయ వర్ధన్ బాబు, సోమ వీరయ్య, పల్లపు శ్రీనివాసు, విజయ రామారావు, ఉపసర్పంచ్ , వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ నూతన పెన్షన్లు

-జనగామ మున్సిపల్ చైర్పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్

(జనగామ నవంబర్ 17 తెహెల్కా న్యూస్‌ప్రతినిధి సాగర్)



జనగామ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా పెన్షన్స్ మంజూరు చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి కి పాలాభిషేకం నిర్వహించి తర్వాత ఆసరా పెన్షన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసిన జనగామ మున్సిపల్ చైర్పర్సన్ శ్రీమతి కడకంచి బాలమణి శ్రీనివాస్ ఈ సందర్భ ంగా ఛైర్పర్సన్ కడకంచి బాలామణి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మరియు ఇతర అర్హులైన వర్గాలకు సామాజిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో చేయూత పెన్షన్లను అందిస్తోందని తెలిపారు.పెన్షన్ అనేది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, వృద్ధులు మరియు నిరుపేద కుటుంబాలకు ఆత్మగౌరవంతో జీవించేందుకు ఒక భరోసా అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. చేయూత పెన్షన్ల ద్వారా వేలాది నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లబ్ధిదారుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

కోదాడలో జనవరి 10 వరకు, అయ్యప్ప స్వాములకు నిత్య అన్నదానం



కోదాడ ,నవంబర్ 17(తెహెల్కా న్యూస్)

సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో హుజూర్నగర్ రోడ్ లో గల ,గాలి శ్రీనివాస్ నాయుడు స్థలములో, 13 సంవత్సరాలుగా, రెండు నెలల పాటు వేలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు జనవరి 10 వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీనియర్ న్యాయవాది నిర్వాహకులు గాలి శ్రీనివాస్ నాయుడు తెలిపారు స్వాములు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో , పారిశ్రామికవేత్తలు బుర్ర ప్రమోద్ రెడ్డి,సతీష్ రెడ్డి సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు

చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ



తెహెల్కా న్యూస్ నవంబర్ 17 గుండాల:

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని వాసావి గార్డెన్స్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రజాప్రభుత్వం, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం గుండాల మండలానికి చెందిన అర్హులైన 609 మంది లబ్ధిదారులకు నూతన చేయూత పెన్షన్ మంజూరి పత్రాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నెక్స్ట్ అధికారంలో రాదు అని హేళన చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

-తిప్పి కొట్టిన గ్రేటర్ వరంగల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి



(వరంగల్ నవంబర్ 17 తెహెల్కా న్యూస్ ప్రతినిధి సాగర్)

తుమ్మల నాగేశ్వరావు అగ్రికల్చర్ మంత్రివర్యులు మంథని పత్రిక విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నెక్స్ట్ అధికారంలో రాదు ఎలెనో ఎఫెక్ట్ వల్ల. గత ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు హైటెక్ సిటీ ఇంప్లిమెంట్ చేసిన ప్రభుత్వం అధికారం కోల్పోయింది అని అప్పుడు తెలంగాణ ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని ఎమ్మెల్యేలు మనసులో ఉన్న మాటలను నేను తెలియజేస్తున్నాను 45 లక్షల మంది కొత్త పెన్షన్లు ఇవ్వడం జరిగింది ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కూడా అధికారం కోల్పోయిన కోల్పోతుందని సీఎం రేవంత్ రెడ్డి వల్ల పార్టీకి నష్టం జరుగుతుందని తుమ్మల అనడం తీవ్రంగా ఖండించిన గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి తీవ్రంగా ఖండించారు తుమ్మల నాగేశ్వరావు టిడిపిలో మంత్రిగా టిఆర్ఎస్ లో మంత్రిగా ఇప్పుడు కాంగ్రెస్ లో మంత్రిగా అన్ని పార్టీలో పనిచేసి ఇప్పుడు ఏ కొత్త పార్టీలో వెళ్లడానికి ఆలోచించి చేస్తున్నావు అని మంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పోలేపాక ప్రసాద్ సతీష్ తదితరులు పాల్గొన్నారు. బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేలి శ్రీనివాస్ రెడ్డి ఇంటికిమెద క్ ఎంపీ రఘునందన్ రావు విచ్చే సి భోజనం చేయడం జరిగింది. అనంతరం స్థానిక సమస్యలపై తెలుసుకోవడం ఎస్ ఐ ఆర్ గు రించి వివరించడం జరిగింది. ఈ సందర్భంగా నాగేల్లి శ్రీనివాస రెడ్డి ఇంటికి బిజెపి నాయకులు జిల్లా అధ్యక్షులు ముట్కురి అశో క్ గౌడ్ పాశం భాస్కర్ గూడూరు నారాయణరెడ్డి నవరత్నం రెడ్డి పట్నం శ్రీనివాస్, చందా మహేంద ర్ గుప్తా,రత్నపురం బలరాం, బెల్లంకొండ కిరణ్, బెల్లంకొండ ఉపేందర్,ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కానుకుంట్ల రమేష్ కోటి మేడి కోటేష్ రాము, ఎరుపుల శివ శ్రీశైలం పట్నం దిలీప్ పాశం అక్షిత్ ఉదగిరి అక్షిత్ సురేష్ రెడ్డి బాల్ శంకర్ రావుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ లోన్, ఉద్యోగాల పేరుతో మోసాలు: సైబర్ నేరగాళ్ల గుట్టు రట్టు నిందితుడి అరెస్ట్

-జనగామ సిఐ సత్యనారాయణ రెడ్డి

(జనగామ నవంబర్ 17తెహెల్కా న్యూస్ ప్రతినిధి సాగర్)



ఆన్‌లైన్ లోన్ మరియు ఉద్యోగాల పేరుతో అమాయకులను మోసగించి, తెలంగాణ వ్యాప్తంగా 84 సైబర్ నేరాలకు పాల్పడిన ముఠా గుట్టును జనగామ పోలీసులు రట్టు చేశారు, సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ ఇన్‌స్టా, యూట్యూబ్ వేదికగా సోషల్ మీడియా ద్వారా పరిచయమైన సైబర్ నేరగాళ్ల వలలో పడి, ట్రైనింగ్ మరియు ఇన్సూరెన్స్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న ప్రధాన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు, వరంగల్ కమిషనరేట్ పరిధిలో 5 కేసులతో పాటు వివిధ రాష్ట్రాల్లోనూ ఈ ముఠాపై కేసులు ఉన్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన జనగాం పోలీసు సిబ్బందిని, వరంగల్ సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటరమణ, ఎస్సైలు చరణ్, ప్రవీణ్ తదితరులను అభినందించారు. ఆన్‌లైన్‌లో లోన్లు, ఉద్యోగాల పేరుతో డబ్బులు అడిగే మోసగాళ్లను నమ్మవద్దని, ఎవరైనా బాధితులుగా మారితే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌ను లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

భువనగిరిలో ఘనంగా శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణోత్సవం



తెహెల్కా న్యూస్ భువనగిరి 17-11-2026

భువనగిరి పట్టణంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణోత్సవం అ త్యంత వైభవంగా,భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగింది.ఈ కళ్యాణోత్సవంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ల పల్లి శ్రీవాణి రవికుమార్ దంపతులు పాల్గొని,అమ్మవారికి ప్రత్యేక పూ జలు నిర్వహించి,కళ్యాణ వేడుక లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు చైర్మన్ దంపతులకు,కౌన్సిలర్లకు,మున్సి పల్ కమిషనర్ కిశాలువాతో స త్కరించి ఘనంగాసన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ క మిషనర్ చంద్రప్రకాష్ రెడ్డి,కౌన్సి లర్లు కుక్కడుగు పద్మావతి,సుద గాని సరిత,గంజి శ్రీవాణి,తోట కూర విజయలక్ష్మి,వెంకటేష్ యా దవ్,భువనగిరి డివిజన్ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ తంగాళ్ళ పల్లి శ్రీవాణి రవికుమార్ మాట్లా డుతూ.. అమ్మవారి ఆశీస్సులతో భువనగిరి పట్టణ ప్రజలందరూ సుఖ సంతోషాలతో,ఆయురారో గ్యాలతో ఉండాలని కోరుకున్న ట్లు తెలిపారు.

పింఛన్లపై కాంగ్రెస్ మోసం - మండిపడ్డ ఉద్యమకారుడు మల్లికార్జున యాదవ్



హైదరాబాద్ : నవంబర్ 17 తెహెల్కా న్యూస్;

ఎన్నికల్లో వృద్ధులకు, వితంతువులకు 4000, వికలాంగులకు 6000 రూపాయల పింఛన్ ఇస్తామని గొప్పలు చెప్పి, అధికారంలోకి వచ్చాక తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన 2016 రూపాయలనే కొనసాగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఉద్యమకారుడు మల్లికార్జున్ యాదవ్ ధ్వజమెత్తారు. అంబర్‌పేట్ గోల్నాకలోని మహారాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో నూతనంగా మంజూరైన పింఛన్‌దారులకు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ యాదవ్ మాట్లాడుతూ ... కేసీఆర్ 500 ఉన్న పింఛన్‌ను 2016కు పెంచి పేదలకు అండగా నిలిచారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లోనే 4000 చేస్తామని హామీ ఇచ్చి మూడేళ్లు కావస్తున్నా ఒక్క రూపాయి కూడా పెంచలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఒక్కటి కూడా నెరవేరడం లేదని, ఇంకా చాలామందికి పింఛన్లు రావాల్సి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని మల్లికార్జున్ యాదవ్ డిమాండ్ చేశారు. అనంతరం బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

పట్టణ జూనియర్ కళాశాలలో అథ్లెటిక్స్ పోటీలు.



తెహెల్కా న్యూస్ భువనగిరి 17-11-2026

ఉమ్మడి నల్లగొండ జిల్లా 70 ఎస్ జిఎఫ్ అండర్19 అథ్లెటిక్స్ క్రీడ ల పోటీలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎన్. ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.ఈపోటీలలో గెలుపొందిన విద్యా ర్థులకు కళాశాల వైస్ ప్రిన్సిపల్, ఎస్ ఎల్ ఎన్ ఎస్ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బి.పాండురంగం, పీడీ జి.ఐలయ్య ముఖ్య అతిథు లుగా హాజరై విజేతలకు గోల్డ్ మె డల్స్,సర్టిఫికెట్స్ అందజేశారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థు లు రాష్ట్రస్థాయిలో పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

హైదరాబాద్‌లో నకిలీ వెండి వరఖ్ తయారీ ముఠాల గుట్టురట్టు చేసిన కమిషనర్స్ టాస్క్ ఫోర్స్; నాలుగు కేంద్రాలపై దాడులు, భారీగా అల్యూమినియం రేకులు, కల్తీ సామగ్రి స్వాధీనం

AMEER HUSSAIN CRIME BEURO CHIEF

హైదరాబాద్‌లోని పాతబస్తీ చార్మినార్ మరియు పరిసర ప్రాంతాల్లో ఆహార భద్రతా ప్రమాణాలను తుంగలో తొక్కుతూ నకిలీ తినదగిన వెండి వరఖ్ (రేకులు) మరియు వెండి ఫ్లేక్స్‌ను అక్రమంగా తయారు చేసి విక్రయిస్తున్న నాలుగు కేంద్రాలపై హైదరాబాద్ కమిషనర్స్ టాస్క్ ఫోర్స్ బృందం స్థానిక పోలీసులతో కలిసి మంగళవారం (17.11.2026) మెరుపు దాడులు నిర్వహించింది. విశ్వసనీయ సమాచారం మేరకు చేపట్టిన ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో నాలుగు వేర్వేరు తయారీ కేంద్రాలపై నాలుగు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ దాడుల్లో పట్టుబడిన నాలుగు తయారీ కేంద్రాలు మరియు వాటి యజమానుల వివరాలు ఇలా ఉన్నాయి: మొదటిది చార్మినార్ బస్టాండ్ సమీపంలోని మక్కా మసీదు పక్కన గల షాప్ నంబర్ 20-4-6 లోని మెస్సర్స్ ఇత్తెహాద్ వరఖ్ షాప్ (యజమాని: మహమ్మద్ అక్బర్, 45 సంవత్సరాలు); రెండవది చార్మినార్ కొత్త బస్టాండ్ పంచ్ మొహల్లాలోని షాప్ నంబర్ 20-4-6/1 లోని మెస్సర్స్ యుటిసి సిల్వర్ లీఫ్స్ (యజమాని: మహమ్మద్ వలీ ఉద్దీన్, 62 సంవత్సరాలు); మూడవది పంచ్ మొహల్లాలోని చార్మినార్ బస్ స్టాప్ ఎదురుగా ఉన్న మెస్సర్స్ ఎం.ఎ. మెట్రో వరఖ్ షాప్ (యజమాని: మహమ్మద్ షరీఫ్, 60 సంవత్సరాలు); మరియు నాలుగవది ఫలక్‌న ుమాలోని బీబీకాచష్మా, అచ్చిరెడ్డి నగర్‌లో ఉన్న మెస్సర్స్ తారా యూనిట్ (యజమాని: మహమ్మద్ జలీల్ ఖాన్, తండ్రి: కీ.శే. మహమ్మద్ బురాన్ ఖాన్, 47 సంవత్సరాలు).దాడుల అనంతరం ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 318(4), 110 కింద కేసులు నమోదు చేశారు. చార్మినార్‌లోని మెస్సర్స్ ఇత్తెహాద్ వరఖ్ షాప్‌పై చార్మినార్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 233/2026; హుస్సేనిఆలంలోని మెస్సర్స్ యుటిసి సిల్వర్ లీఫ్స్‌పై హుస్సేనిఆలం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 349/2026; మెస్సర్స్ ఎం.ఎ. మెట్రో వరఖ్ షాప్‌పై మొఘల్‌పురా పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 290/2026; మరియు ఫలక్‌నుమా బీబీకాచష్మాలోని మెస్సర్స్ తారా యూనిట్‌పై ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 552/2026 కింద కేసులు నమోద య్యాయి.ఈ తనిఖీల్లో నిందితుల వద్ద నుండి భారీ మొత్తంలో నకిలీ నిల్వలు, ముడిసరుకులు మరియు తయారీ యంత్రాలను పోలీసులు జప్తు చేశారు. స్వాధీనం చేసుకున్న వాటిలో 49 బండిళ్ల నకిలీ వెండి రేకులు (అల్యూమినియం రేకులు)---వీటిలో ఒక్కో బండిల్‌లో 12 చిన్న బండిళ్లు ఉండే 14 సెం.మీ. ఐ 10 సెం.మీ. పరిమాణం గల 41 బండిళ్లు, 7 సెం.మీ. ఐ 8 సెం.మీ. చిన్న సైజు గల 8 బండిళ్లు ఉన్నాయి. వీటితో పాటు ఒక్కొక్కటి 1 కిలో బరువున్న 10 కార్టన్లు (మొత్తం 10 కిలోలు), ఒక్కొక్కటి 1 కిలో బరువున్న 2 పాలిథిన్ సంచులు, మరియు ఒక్కొక్కటి 50 గ్రాముల బరువున్న 32 కవర్లలో ఉన్న నకిలీ సిల్వర్ ఫ్లేక్స్ (అల్యూమినియం ఫ్లేక్స్) లభించాయి. అంతేకాకుండా 1 కిలో నకిలీ వెండి పూత పూసిన చక్కెర గుళికలు, ఒక్కొక్కటి 500 గ్రాముల బరువున్న 30 జార్ల ఖివామ్, సుమారు 30 కిలోల బరువున్న 3 టబ్బుల ఖివామ్, ఒక్కొక్కటి 500 గ్రాముల బరువున్న 20 ఖివామ్ సీసాలు, ఒక్కొక్కటి 25 కిలోల బరువున్న 2 గోనె సంచుల పొగాకు, 1 కిలో టాల్కమ్ పౌడర్, 50 సీసాల ఫ్లేవర్డ్ పాన్ చట్నీలు, 5 పుస్తకాల జంతు చర్మపు షీట్లు, సుమారు 10 లీటర్ల గ్లూకోజ్ ద్రవ్ము, సుమారు 40 కిలోల మొక్కజొన్న పిండి (మెయిజ్ స్టార్చ్) స్వాధీనం చేసుకున్నారు. తయారీ పరికరాలలో భాగంగా 1 మిక్సర్ గ్రైండర్, 1 లాంగ్ మిక్సర్, 1 ప్యాకింగ్ మెషిన్, 1 తూకం యంత్రం, 1 ఖాళీ ఇండియన్ గృహ వినియోగ గ్యాస్ సిలిండర్, 1 గ్యాస్ స్టవ్ మరియు 1 వంట పాత్రను పోలీసులు సీజ్ చేశారు. నిందితుల అక్రమ కార్యకలాపాలపై జరిపిన విచారణలో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. నిందితులు ఎటువంటి చెల్లుబాటు అయ్యే ఎఫ్ఎస్ఎస్ఏఐ (FSSAI) లైసెన్స్ లేకుండానే అసలైన వెండికి బదులుగా చౌకైన అల్యూమినియంను ఉపయోగించి తినదగిన వెండి వరఖ్‌లు, ఫ్లేక్స్ మరియు అలంకరణ వస్తువులను తయారు చేస్తున్నారు. వీటిని కాజు కట్లీ, కాజు రోల్స్, చమ్ చమ్ వంటి మిఠాయిలు మరియు స్వీట్ పాన్‌లలో వాడేందుకు స్వీట్ తయారీ కేంద్రాలకు సరఫరా చేస్తుండగా, అల్యూమినియం పూత పూసిన చక్కెర గుళికలను కేకులు మరియు బేకరీ టాపింగ్స్ కోసం బేకరీలకు అమ్ముతున్నారు. ఉత్తరప్రదేశ్ నుండి అల్యూమినియం ఫ్లేక్స్‌ను దిగుమతి చేసుకుని జర్దా, ఖివామ్ మరియు సుగంధ పాన్ తయారీలలో ఉపయోగిస్తున్నారు. పండుగల సీజన్‌లో పెరిగే డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని ఇతర రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున ఈ నకిలీ సామగ్రిని తెప్పించి, వాటిని స్వచ్ఛమైన వెండి ఉత్పత్తులుగా నమ్మించి తెలంగాణ వ్యాప్తంగా ఉన్న స్థానిక మరియు ప్రముఖ స్వీట్ షాపులు, బేకరీలు, పాన్ షాపులకు సరఫరా చేస్తూ అక్రమ లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ చర్యలు ఆహార భద్రతా ప్రమాణాల (ఆహార ఉత్పత్తుల ప్రమాణాలు మరియు ఆహార సంకలనాలు) నిబంధనలు, 2011 లోని నిబంధన 2.11.4 కు పూర్తిగా విరుద్ధమని పోలీసులు తెలిపారు. ఈ నిబంధన ప్రకారం తినదగిన వెండి రేకు (వరఖ్) కనీసం 999/1000 (99.9%) వెండి స్వచ్ఛతను కలిగి ఉండాలి మరియు తయారీ ప్రక్రియలో ఏ దశలోనూ జంతువుల నుండి సేకరించిన పదార్థాలను



ఉపయోగించకూడదు. ఆహార-గ్రేడ్ కాని ఇటువంటి అల్యూమినియం ఉత్పత్తులను దీర్ఘకాలం తీసుకోవడం వల్ల మూత్రపిండాలు దెబ్బతినడం, నరాల సంబంధిత వ్యాధులు, ఎముకల రుగ్మతలు, జీర్ణవ్యవస్థ సమస్యలు మరియు శరీరంలో విషపూరిత అల్యూమినియం పేరుకుపోవడం వంటి తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలు తలెత్తుతాయి. నకిలీ వెండి వరఖ్‌ను గుర్తించడానికి రెండు ప్రాథమిక పరీక్షా పద్ధతులు ఉన్నప్పటికీ, తుది నిర్ధారణకు ప్రయోగశాల విశ్లేషణ తప్పనిసరని అధికారులు స్పష్టం చేశారు. సజల హైడ్రోక్లోరిక్ ఆమ్ల (Dilute HCl) పరీక్షలో కొద్దిపాటి అల్యూమినియం వరఖ్ నమూనా సజల హైడ్రోక్లోరిక్ ఆమ్లంతో చర్య జరిపి మండే స్వభావం గల హైడ్రోజన్ వాయువు బుడగలను విడుదల చేస్తూ క్రమంగా కరిగిపోతుంది, కానీ అసలైన వెండి సాధారణంగా ఎటువంటి చర్య జరపదు (ఈ రసాయన పరీక్షను శిక్షణ పొందిన నిపుణులు మాత్రమే మంటలకు దూరంగా భద్రతా జాగ్రత్తలతో చేయాలి). ఇక రుద్దే పరీక్ష (Rubbing Test) లో వేళ్ల మధ్య సున్నితంగా రుద్దినప్పుడు అసలైన వెండి వరఖ్ అతి సూక్ష్మ కణాలుగా విడిపోతుండగా, అల్యూమినియం వరఖ్ నలిగిపోవడం, చిరిగిపోవడం లేదా చిన్న బంతిలాంటి ముక్కలుగా మారడం జరుగుతుంది. నిందితులపై సంబంధిత చట్ట నిబంధనల ప్రకారం తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని పోలీసులు తెలిపారు. హైదరాబాద్ కమిషనర్స్ టాస్క్ ఫోర్స్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఐ.పి.ఎస్. గారి నాయకత్వంలో, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీ ఎన్. రంజిత్ కుమార్ గౌడ్, సబ్-ఇన్స్పెక్టర్లు మరియు టాస్క్ ఫోర్స్ బృందం ఈ ఆపరేషన్‌ను సమర్థవంతంగా నిర్వహించారు.

వర్కింగ్ జర్నలిస్టుల ప్రెస్ క్లబ్



-జాతీయ పత్రికా దినోత్సవ వేడుకలు

తెహెల్కా న్యూస్ నవంబర్ 17

తెలంగాణ యూనిట్, వర్కింగ్ జర్నలిస్టుల ప్రెస్ క్లబ్ (PCWJ), హైదరాబాద్‌లోని ఖాజా షెక్ మీటింగ్ హాల్, తెలంగాణ ఉర్దూ అకాడమీ, ఉర్దూ మస్కాన్‌లో జాతీయ పత్రికా దినోత్సవం 2026 మరియు వర్కింగ్ జర్నలిస్టుల ప్రెస్ క్లబ్ 9వ వ్యవస్థాపక దినోత్సవాన్ని అత్యంత ఉత్సాహంగా, వైభవంగా జరుపుకుంది. స్వేచ్ఛాయుత, బాధ్యతాయుతమైన పత్రికా స్వేచ్ఛ ప్రాముఖ్యతను గుర్తించడం, పాత్రికేయ విలువలను ప్రోత్సహించడం, మరియు వర్కింగ్ జర్నలిస్టుల భద్రత, సంక్షేమం, వృత్తిపరమైన హక్కులను తెలియజేయడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్కింగ్ జర్నలిస్టుల ప్రెస్ క్లబ్ వ్యవస్థాపకులు మరియు చైర్మన్ అయిన డాక్టర్ సయ్యద్ ఖాలిద్ ఖైస్ గారి నాయకత్వం మరియు మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా, సమాచార మరియు పౌర సంబంధాల (ఐడిపిఆర్) శాఖ డిప్యూటీ డైరెక్టర్ సయ్యద్ ఎహసాన్ హష్మీ గారి సేవలు మరియు కృషికి గుర్తింపుగా ఒక అవార్డును ప్రదానం చేసి సత్కరించారు.ఈ కార్యక్రమానికి ప్రెస్ క్లబ్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ కు చెందిన పలువురు ప్రముఖ కార్యవర్గ సభ్యులు మరియు ప్రతినిధులు హాజరయ్యారు, వారిలో:డా. సయ్యద్ ఖాలిద్ ఖైస్, చైర్మన్ ఉ వ్యవస్థాపకులు, ప్రెస్ క్లబ్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్. షేక్ అమీర్ హుస్సేన్ మీర్ మహమ్మద్ అలీ, జాతీయ కార్యదర్శి, ప్రెస్ క్లబ్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, హైదరాబాద్, తెలంగాణ. శ్రీ ఘోరీ, టీజేఏ-జనరల్ సెక్రటరీ. మహ్మద్ షిరాజ్ - డిజిటల్ మీడియా చైర్మన్. కె.ఎన్.ఎస్. ప్రసాద్, సుప్రీంకోర్టు న్యాయవాది అనిల్ కుమార్, సుప్రీం ఉ తెలంగాణ క్రిమినల్ న్యాయవాది మోమిన్ రోషన్ జమీర్, న్యాయవాది కె. విజయ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాది గీతా వనజక్కి, హైకోర్టు న్యాయవాది ఎండి. సులమాన్ ఖాన్, తెలంగాణ హైకోర్టు ఎం.డి. సోహైల్, హైకోర్టు న్యాయవాది విజయ్ పటాల్, సాంఘిక కార్యకర్త ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో, ప్రజా సమస్యలను



అధికారుల దృష్టికి తీసుకురావడంలో, మరియు సమాజంలో సత్యం, సమగ్రత, జవాబుదారీతనాన్ని కాపాడటంలో పాత్రికేయుల కీలక పాత్రను వక్తలు ప్రముఖంగా ప్రస్తావించారు. పాత్రికేయుల భద్రత, సంక్షేమం, వృత్తిపరమైన హక్కులను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని కూడా వారు నొక్కి చెప్పారు. విజేతలు పురస్కార గ్రహీత సయ్యద్ ఎహసాన్ హష్మీని అభినందించి, ఆయన చేసిన సేవలను ప్రశంసించారు. తెలంగాణ వ్యాప్తంగా పాత్రికేయుల సంక్షేమం, ఐక్యత, రక్షణ కోసం పనిచేయాలనే తమ నిబద్ధతను వారు పునరుద్ఘాటించారు.

బిజినెస్

పబ్లిక్ లిస్టింగ్‌కు వెళ్లాల్సిందే.. టాటా గ్రూప్ దిగ్గజ సంస్థకు ఆర్‌బీఐ కఠిన ఆదేశాలు!



టాటా గ్రూప్‌నకు చెందిన ప్రధాన హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్‌కు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మరోసారి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అప్పర్-లేయర్ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలకు (ఎన్‌బీఎఫ్‌సీ) వర్తించే అన్ని నిబంధనలను పాటించాల్సిందేనని స్పష్టం చేసింది. అందులో స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్ నిబంధన కూడా తప్పనిసరి అని తేల్చిచెప్పింది. ఈ మేరకు టాటా సన్స్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌కు (సీఎఫ్‌వో) ఆర్‌బీఐ ఒక లేఖ ద్వారా తన వైఖరిని స్పష్టం చేసినట్లు నివేదికలు వెల్లడించాయి. గత నెలలో టాటా సన్స్ రెగ్యులేటరీ మార్గదర్శకాలను కోరుతూ రాసిన లేఖకు సమాధానంగా ఆర్‌బీఐ ఈ ఆదేశాలు ఇచ్చింది. టాటా సన్స్ నిర్దిష్ట నిబంధనలపై ఎలాంటి స్పష్టత కోరకపోయినప్పటికీ, ఆ లేఖ స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ అంశానికి సంబంధించిన చర్చలతో ముడిపడి ఉన్నట్లు ఆర్‌బీఐ పేర్కొంది. అప్పర్-లేయర్ ఎన్‌బీఎఫ్‌సీలకు వర్తించే ప్రస్తుత నిబంధనలు, మార్గదర్శకాలు, ఆదేశాలన్నింటినీ తప్పకుండా అనుసరించాలని సూచించింది. ఈ నెలాఖరులో టాటా సన్స్ బోర్డు సమావేశం జరగనున్న నేపథ్యంలో ఆర్‌బీఐ నుంచి ఈ స్పందన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. గత సెప్టెంబర్‌లో కోర్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీగా (సీఐసీ) తన రిజిస్ట్రేషన్‌ను స్వచ్ఛందంగా రద్దు చేసుకోవాలంటూ టాటా సన్స్ పెట్టుకున్న దరఖాస్తును ఆర్‌బీఐ తిరస్కరించింది. రుణాలన్నింటినీ పూర్తిగా తీర్చివేసినందున తమకు ఎన్‌బీఎఫ్‌సీ నిబంధనలు వర్తించవని టాటా సన్స్ వాదించింది.

కొత్త లుక్ తెచ్చినా వర్కౌట్ కాలేదు.. మార్కెట్ నుంచి తప్పుకొన్న పల్సర్ 180



ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ బజాజ్ ఆటో తన ఐకానిక్ మోటార్‌సైకిల్ పల్సర్ 180ని భారత మార్కెట్ నుంచి మరోసారి నిలిపివేసింది. నాలుగేళ్ల విరామం తర్వాత ఏప్రిల్ 2026లో తిరిగి ప్రవేశపెట్టిన ఈ బైక్, సరిగ్గా ఆరు నెలలు తిరిగేసరికి అధికారిక వెబ్‌సైట్ నుంచి అదృశ్యమైంది. గత ఐదేళ్ల వ్యవధిలో ఈ మోడల్‌ను మార్కెట్ నుంచి తప్పించడం ఇది రెండోసారి. అధికారికంగా బజాజ్ ఎలాంటి ప్రకటన విడుదల చేయనప్పటికీ, కంపెనీ అధికారిక పోర్టల్‌లోని 'ఒరిజినల్' విభాగం నుంచి పల్సర్ 180ను పూర్తిగా తొలగించారు.రూ. 1.22 లక్షల (ఎక్స్-షోరూమ్) ఆకర్షణీయ ధరతో బజాజ్ ఈ బైక్‌ను ఏప్రిల్‌లో మార్కెట్లోకి తీసుకొచ్చింది. మార్కెట్లో ఆశించిన స్థాయిలో అమ్మకాలు నమోదు కాకపోవడమే ఈ ఆకస్మిక నిర్ణయానికి కారణంగా తెలుస్తోంది. అమ్మకాలు తగ్గితే మోడళ్లను పక్కన పెట్టే వ్యూహాన్ని అనుసరించే బజాజ్, గత జూన్‌లో ఎన్125ను తొలగించినట్లే ఇప్పుడు 180ని కూడా సైలెంట్‌గా పక్కకు తప్పించింది. ప్రస్తుతం వెబ్‌సైట్‌లో పల్సర్ 125, 150, 220ఎఫ్ మోడళ్లు కొనసాగుతున్నాయి.ఈ మోటార్‌సైకిల్‌లో 178.6 సీసీ సింగిల్ సిలిండర్, ఎయిర్ కూల్డ్ ఇంజిన్‌ను అమర్చారు. ఇది 8,500 ఆర్‌పీఎమ్ వద్ద 17 హెచ్‌పీ పవర్, 6,500 ఆర్‌పీఎమ్ వద్ద 15 ఎన్‌ఎమ్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 5-స్పీడ్ గేర్‌బాక్స్, ముందు 37ఎమ్‌ఎమ్ టెలిస్కోపిక్ ఫోర్కులు, వెనుక ట్విన్ షాక్ అబ్జార్బర్స్‌తో పాటు డ్యూయల్ డిస్క్ బ్రేకులు (ఏబీఎస్), బ్లూటూత్ కనెక్టివిటీ, ఎల్ఈడీ లైటింగ్ వంటి ఆధునిక ఫీచర్లను అందించాయి.

భారత్ లో భారీ పెట్టుబడులకు అమెజాన్ సై.. పునరుత్పాదక రంగంపై ఫోకస్



భారత్‌లో పర్యావరణహిత పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను విస్తరించేందుకు ప్రముఖ అంతర్జాతీయ ఈ-కామర్స్, క్లౌడ్ సేవల దిగ్గజం అమెజాన్ భారీ ప్రణాళికను ప్రకటించింది. 2030 నాటికి దేశంలో అదనంగా మరో 7 బిలియన్ డాలర్లను (సుమారు రూ.58 వేల కోట్లకు పైగా) గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల్లో పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే భారత్‌లో పునరుత్పాదక ఇంధన ఒప్పందాల కోసం 4 బిలియన్ డాలర్లను కేటాయించిన సంస్థ, తాజా నిర్ణయంతో తన విస్తరణను మరింత వేగవంతం చేయనుంది. తద్వారా దేశంలో కర్బన రహిత విద్యుత్‌ను అత్యధికంగా కొనుగోలు చేస్తున్న కార్పొరేట్ సంస్థలలో ఒకటిగా అమెజాన్ తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది.ఇప్పటికే కేటాయించిన 4 బిలియన్ డాలర్ల నిధుల్లో భాగంగా, మొత్తం 934 మెగావాట్ల (వీఔ) సంయుక్త సామర్థ్యంతో కూడిన నాలుగు సరికొత్త విండ్, సోలార్ ప్రాజెక్టులను అమెజాన్ ప్రకటించింది. వీటిలో కర్ణాటకలో 234 మెగావాట్ల భారీ విండ్ ప్రాజెక్ట్‌తో పాటు మరో 200 మెగావాట్ల హైబ్రిడ్ విండ్-సోలార్ ప్రాజెక్ట్ ఉన్నాయి. ఇందులో 234 మెగావాట్ల విండ్ ప్రాజెక్ట్ ఆసియాలోనే అమెజాన్ చేపట్టిన అత్యంత భారీ పవన విద్యుత్ ఒప్పందం కావడం విశేషం. వీటితో పాటు మధ్యప్రదేశ్‌లో 300 మెగావాట్ల సోలార్ ప్రాజెక్ట్, రాజస్థాన్‌లో 200 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయనున్నారు.ఈ నాలుగు ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే, భారత్‌లో అమెజాన్ కాంట్రాక్ట్ చేసుకున్న పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 2 గిగావాట్లకు (+ఔ) పైగా చేరుకుంటుంది. ఈ విద్యుత్ దాదాపు 35 లక్షలకు పైగా భారతీయ గృహాల వార్షిక విద్యుత్ అవసరాలను తీర్చడానికి సమానమని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అమెజాన్‌కు సంబంధించి 14 భారీ విండ్, సోలార్ ప్రాజెక్టులతో పాటు 43 ఆన్-సైట్ సోలార్ యూనిట్లు పనిచేస్తున్నాయి. అంతర్జాతీయంగా చూస్తే అమెజాన్ ఆధ్వర్యంలో 40 గిగావాట్లకు పైగా సామర్థ్యంతో సుమారు 700 ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి.ఈ అదనపు 7 బిలియన్ డాలర్ల పెట్టుబడులు అమెజాన్ ప్రపంచవ్యాప్త పర్యావరణ లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నాయని సంస్థ తెలిపింది.

ఆటగాడిగా తప్పుకొన్నా సీఎస్కే బాస్ మీరే.. 'మహి భాయ్'పై కెప్టెన్ రుతురాజ్ ఎమోషనల్ పోస్ట్



మహేంద్ర సింగ్ ధోనీ ఐపీఎల్ ఆటగాడిగా రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ప్రస్తుత సారథి రుతురాజ్ గైక్వాడ్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యాడు. 2019లో సీఎస్కేలో అడుగుపెట్టిన నాటి నుంచి ధోనీతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఎమోషనల్ పోస్ట్ చేశాడు. ఎన్ని ట్రోఫీలు, విజయాలు సాధించినా ధోనీలో ఉండే 'నిరాడంబరత' తన జీవితంలో నేర్చుకున్న అతిపెద్ద పాఠమని గైక్వాడ్ కొనియాడాడు. 2019లో ఒక సాధారణ యువ బ్యాటర్‌గా జట్టులోకి వచ్చిన నాటి నుంచి ధోనీని దగ్గరి నుంచి పరిశీలిస్తూ ఎంతో నేర్చుకున్నానని రుతురాజ్ రాసుకొచ్చాడు. ఆటలో సాధించాల్సిన శిఖరాలన్నీ అధిరోహిం చినప్పటికీ ధోనీ చూపించే వినయం తనను ఎంతగానో ఆకట్టుకుందని తెలిపాడు. డ్రెస్సింగ్ రూమ్‌ను పంచుకోవడం, మైదానంలో 22 గజాల పిచ్‌పై ధోనీతో కలిసి మ్యాచ్‌లను ముగించడం తనలాంటి క్రికెటర్‌కు ఒక కల సాకారమైన క్షణాలని పేర్కొన్నాడు. 2024 సీజన్‌లో కెప్టెన్సీ పగ్గాలు అందుకున్నప్పటి నుంచి ధోనీపై గౌరవం మరింత పెరిగిందని తెలిపాడు. మైదానంలో ఆటగాడిగా వీడ్కోలు పలికినప్పటికీ, సీఎస్కే జట్టులో ధోనీ స్థానం ఎప్పటికీ మారబోదని రుతురాజ్ గైక్వాడ్ వ్యాఖ్యానించాడు. "మీరు ఎప్పటికీ మా 'తలా'.. మా కెప్టెన్, మా లీడర్" అంటూ భావోద్వేగంగా పేర్కొన్నాడు. చివరగా "థ్యాంక్యూ మహి భాయ్ ఫర్ ఎవ్రీథింగ్" అంటూ తన సందేశాన్ని ముగించాడు. 278 మ్యాచ్‌ల్లో 5,439 పరుగులు చేసి, జట్టుకు 5 ఐపీఎల్ ట్రోఫీలు, 2 ఛాంపియన్స్ లీగ్ టైటిళ్లు అందించిన ధోనీ.. ఆటగాడిగా తప్పుకొన్నా మెంటార్‌గా జట్టుతోనే కొనసాగనున్నాడు. కెప్టెన్సీ మారినా చెన్నైకి అసలైన లీడర్ ధోనీయేనని రుతురాజ్ మాటలు నిరూపిస్తున్నాయి.

ఎస్ఆర్‌హెచ్ నుంచి గుజరాత్ గూటికి రెండుసార్లు పర్పుల్ క్యాప్ గెలచుకున్న పేసర్



ఐపీఎల్‌లో రెండుసార్లు పర్పుల్ క్యాప్ గెలుచుకున్న స్టార్ పేసర్ హర్షల్ పటేల్ గుజరాత్ టైటాన్స్ (జీటీ) గూటికి చేరాడు. రాబోయే సీజన్‌కు ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) నుంచి హర్షల్ పటేల్‌ను ట్రేడింగ్ ద్వారా గుజరాత్ సొంతం చేసుకున్నట్లు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ అధికారికంగా ప్రకటించింది. 2025 మెగా వేలంలో ఎస్ఆర్‌హెచ్ ఇతడిని రూ.8 కోట్లకు కొనుగోలు చేయగా, ఇప్పుడు సగానికి తగ్గించి రూ. 4 కోట్ల ధరకు గుజరాత్ టైటాన్స్‌కు బదిలీ చేసింది. ఈ తాజా ఒప్పందంతో హర్షల్ పటేల్ తన సొంత రాష్ట్ర జట్టు తరఫున ఆడనున్నాడు. అహ్మదాబాద్‌లో జన్మించిన ఈ సీనియర్ పేసర్, ఇప్పటికే దేశవాళీ క్రికెట్‌లో గుజరాత్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. గతంలోనూ అతడిని దక్కించుకునేందుకు గుజరాత్ ఫ్రాంచైజీ గట్టిగానే ప్రయత్నించింది. 2024 వేలంలో రూ.10.5 కోట్ల వరకు పోటీపడి వెనక్కి తగ్గగా, పంజాబ్ కింగ్స్ రూ. 11.75 కోట్లకు దక్కించుకుంది. ఆ తర్వాత 2025 వేలంలోనూ గుజరాత్ రూ.6.5 కోట్ల వరకు బిడ్ వేసి రేసు నుంచి తప్పుకొంది. ఎట్టకేలకు ఇప్పుడు ట్రేడ్ ద్వారా అతడిని తమ బౌలింగ్ విభాగంలోకి చేర్చుకుంది. అక్కడ కగిసో రబాడ, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, జాసన్ హోల్డర్ వంటి అనుభవజ్ఞులైన పేసర్లతో కలిసి హర్షల్ బరిలోకి దిగనున్నాడు.35 ఏళ్ల హర్షల్ పటేల్ ఐపీఎల్‌లో ఇప్పటివరకు 124 మ్యాచ్‌లాడి 151 వికెట్లు పడగొట్టాడు. ఆర్సీబీ (2021), పంజాబ్ కింగ్స్ (2024) తరఫున అత్యధిక వికెట్లు తీసి రెండుసార్లు పర్పుల్ క్యాప్ అందుకున్నాడు. అయితే 2025 సీజన్‌లో ఎస్ఆర్‌హెచ్ తరఫున 13 మ్యాచ్‌ల్లో 16 వికెట్లు తీసినప్పటికీ, గత సీజన్‌లో కేవలం 5 మ్యాచ్‌ల్లోనే అవకాశాలు దక్కించుకుని ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. మరోవైపు ఎస్ఆర్‌హెచ్ ఇప్పటికే బౌలింగ్ విభాగాన్ని పటిష్ఠం చేసే క్రమంలో ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి టి.నటరాజన్‌ను, చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన ఎక్స్ఛేంజ్‌లో ఖలీల్ అహ్మద్, నాథన్ ఎల్లిస్‌లను తమ జట్టులోకి తీసుకుంది.

స్పోర్ట్స్

గుర్నూర్ బ్రార్‌ను మందలించిన ఐసీసీ ఓ డీమెరిట్ పాయింట్‌తో శిక్ష



న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగో వన్డే మ్యాచ్‌లో ఐసీసీ ప్రవర్తనా నియమావళిని (కోడ్ ఆఫ్ కండక్ట్) భారత యువ పేసర్ గుర్నూర్ బ్రార్ ఉల్లంఘించినట్లు ఐసీసీ తేల్చింది. అందుకుగానూ అతడిని మందలించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్‌ను విధించింది. మౌంట్ మౌంగనూయి వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో కివీస్ బ్యాటర్ టిమ్ సీఫెర్ట్‌ను ఔట్ చేసిన తర్వాత అతడి వద్దకు వెళ్లి అతిగా సంబరాలు చేసుకోవడంతో గుర్నూర్‌పై ఈ చర్యలు తీసుకున్నారు.ఐసీసీ లెవెల్-1 కోడ్ ఆఫ్ కండక్ట్‌లోని ఆర్టికల్ 2.5ను గుర్నూర్ బ్రార్ ఉల్లంఘించినట్లు మ్యాచ్ రిఫరీ నిర్ధారించారు. అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో ఒక బ్యాటర్‌ను ఔట్ చేసిన తర్వాత వారిని రెచ్చగొట్టేలా లేదా కించపరిచేలా సైగలు, భాషను ఉపయోగించడం ఈ నిబంధన కిందకు వస్తుంది. మ్యాచ్‌లోని 12వ ఓవర్‌లో సీఫెర్ట్‌ను పెవిలియన్ చేర్చిన వెంటనే గుర్నూర్ అతడి ముఖం వద్దకు వెళ్లి దూకుడుగా అరవడంతో, అక్కడే ఉన్న విరాట్ కోహ్లీ జోక్యం చేసుకుని బౌలర్‌ను శాంతింపజేయాల్సి వచ్చింది. గత 24 నెలల వ్యవధిలో గుర్నూర్‌కు ఇది రెండో తప్పు కావడంతో, అతడి ఖాతాలో డీమెరిట్ పాయింట్ల సంఖ్య రెండుకు చేరింది. మ్యాచ్ రిఫరీ రంజన్ మదుగల్లె విధించిన ఈ శిక్షను గుర్నూర్ అంగీకరించడంతో విచారణ అవసరం లేకుండానే కేసును ముగించారు.ఈ మ్యాచ్‌లో భారత్ 244 పరుగుల భారీ తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది.

అభిషేక్ బచ్చన్ ఫోన్ నుంచి రాణికి ప్రియాంక మెసేజ్ ఆ తర్వాత ఏమైందంటే?



బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా తన సహనటుడు అభిషేక్ బచ్చన్‌తో చేసిన ఒక సరదా ప్రాంక్‌కు సంబంధించిన పాత ఇంటర్వ్యూ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అభిషేక్ ఫోన్ నుంచి నటి రాణి ముఖర్జీకి ప్రియాంక పంపిన సందేశం అప్పట్లో సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. వివరాల్లోకి వెళితే.. ప్రముఖ టాక్ షో 'రాన్‌డేవూ విత్ సిమి గరేవాల్'లో ప్రియాంక ఈ విషయాన్ని వెల్లడించింది. 2005లో విడుదలైన 'బ్లఫ్‌మాస్టర్!' సినిమా షూటింగ్ సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సెట్‌లో అభిషేక్ బచ్చన్ సరదాగా ప్రియాంక ఫోన్ తీసుకుని స్విచ్ ఆఫ్ చేసి దాచిపెట్టగా, అందుకు ప్రతిగా తాను అతని ఫోన్‌తో ఈ ప్రాంక్ చేశానని ఆమె వివరించింది. అభిషేక్ ఫోన్ నుంచి రాణి ముఖర్జీకి.. 'ఐ మిస్ యూ, ఎక్కడున్నావు?' అనే అర్థం వచ్చేలా ఒక సందేశాన్ని పంపినట్లు ప్రియాంక తెలిపింది. ఆ తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి, సహనటుడు రితేశ్ దేశ్‌ముఖ్‌తో కలిసి అక్కడి నుంచి వెళ్ళిపోయినట్లు చెప్పింది. ఆ మెసేజ్‌కు రాణి స్పందిస్తూ.. 'హాయ్ ఏబీ, నీకేమైంది?' అని రిప్లై ఇచ్చారట. ఈ విషయం హోస్ట్ సిమి గరేవాల్‌కు ఎలా తెలిసిందని ప్రియాంక ఆశ్చర్యం వ్యక్తం చేయగా, బహుశా అభిషేకే ఈ విషయాన్ని అందరికీ చెప్పి ఉంటాడని ఆమె నవ్వుతూ పేర్కొంది. ఆ సమయంలో అభిషేక్, రాణి ముఖర్జీల మధ్య ప్రేమాయణం సాగుతోందంటూ వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ ఘటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సంఘటన తర్వాత ప్రియాంక, అభిషేక్ కలిసి 'ద్రోణ', 'దోస్తానా' వంటి చిత్రాల్లో నటించారు.

కృష్ణగారి కోపం అలా ఉండేదట!

వెండితెరను దశాబ్దాల పాటు ఏలిన కథానాయకులలో కృష్ణ ఒకరు. పల్లెటూరి మొనగాడు .. కార్మిక నాయకుడు .. వంటి పాత్రలలో ఆయనకి తిరుగులేదని చెప్పుకునేవారు. తెలుగు సినిమాకి మరింత భారీతనాన్ని తెచ్చిన కృష్ణ గురించి ఎవరిని అడిగినా, ఆయన దేవుడిలాంటి మనిషి అనే చెబుతారు. ఆయన వ్యక్తిత్వాన్ని గురించిన అనేక విషయాలను వెల్లడిస్తారు. అలా నిర్మాత శాఖమూరి మల్లికార్జున్ 'ఐ డ్రీమ్' వారికి ఇచ్చిన ఇంటర్వ్యూలో కృష్ణ గురించి ప్రస్తావించారు. ఆయన గురించిన తనకి తెలిసిన విషయాలను పంచుకున్నారు. "అప్పట్లో కృష్ణగారు – రాఘవేంద్రరావుగారి కాంబినేషన్ అంటే ఆ సినిమా సూపర్ హిట్ అని చెప్పుకునేవారు. అయితే దాసరి గారు అన్నాగానీ కృష్ణగారికి ఎంతో అభిమానం ఉండేది. కృష్ణగారు 'దేవదాసు' సినిమాను తీసిన సమయంలో అక్కినేనికి .. ఆయనకి మధ్య వార్ నడిచేదనే ప్రచారం జరిగింది. కానీ వాళ్లిద్దరూ ఎప్పటి మాదిరిగానే మాట్లాడుకునేవారు. ఆ తరువాత కూడా వాళ్లు కలిసి నటించారు. కృష్ణగారి కోపం ఆ గంట .. ఆ పూట మాత్రమే. ఆ తరువాత ఆ విషయాన్ని ఆయన మరిచిపోతారు" అని చెప్పారు. "కృష్ణ గారు చాలా గొప్ప వ్యక్తి. ఆయనకి ఎవరితోనూ ఎలాంటి శత్రుత్వం ఉండేది కాదు. అప్పట్లోనే ఎక్కువ మల్టీస్టారర్ సినిమాలు చేసింది కృష్ణగారే. 'గంగ మంగ' కథ విన్న తరువాత ఏ పాత్ర వేస్తారని అడిగితే, శోభన్ బాబు సెలెక్ట్ చేసుకునే పాత్ర కాకుండా మిగిలిన పాత్రను తాను చేస్తానని చెప్పారు. అలా ఆయన చాలా బోల్డ్ గా చెప్పేవారు. మనసులో ఏమీ పెట్టుకునేవారు కాదు. ఆయనకి ఎన్టీఆర్ పట్ల గౌరవం .. అక్కినేని పట్ల అభిమానం .. శోభన్ బాబుగారి పట్ల సోదర ప్రేమ ఉండేవి" అని అన్నారు.



అది అప్పుడూ ఉంది.. ఇప్పుడూ ఉంది: కాస్టింగ్ కౌచ్‌పై రమ్యకృష్ణ షాకింగ్ కామెంట్స్!

సినీ పరిశ్రమలో ఎప్పటినుంచో చర్చనీయాంశంగా ఉన్న 'కాస్టింగ్ కౌచ్'పై సీనియర్ నటి రమ్యకృష్ణ సంచలన వ్యాఖ్యలు చేశారు. చిత్ర పరిశ్రమలో ఈ తరహా వేధింపులు అప్పుడూ ఉన్నాయని, ఇప్పుడూ ఉన్నాయని, భవిష్యత్తులో కూడా ఉంటాయని ఆమె స్పష్టం చేశారు. ఈ దోపిడీ కేవలం ఒక పరిశ్రమకే పరిమితం కాదని, లింగ భేదం లేకుండా అన్ని రంగాల్లోనూ జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. "అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశంలోనే ఎప్‌స్టీన్ ఫైల్స్ లాంటివి బయటపడ్డాయి. అక్కడ మహిళలు ఎంతో ముందున్నా అలాంటివి ఎదుర్కోవాల్సి వచ్చింది. కాబట్టి ఇక్కడ జరగదని చెప్పలేం. ఇష్టంతోనో, బలవంతంగానో, మామూలుగానో.. అది జరుగుతూనే ఉంటుంది. దీన్ని ఎవరూ కాదనలేరు. మనది గ్లామర్ ప్రపంచం కాబట్టి దీని గురించి ఎక్కువగా మాట్లాడుకుంటారు. బయట కూడా ఎంతోమంది మహిళలు ఇలాంటివి ఎదుర్కొంటున్నారు" అని వివరించారు. గతంలో చిత్ర పరిశ్రమలో తాము ఎదుర్కొన్న కష్టాలను కూడా రమ్యకృష్ణ గుర్తుచేసుకున్నారు. ఆ రోజుల్లో ఫిల్మ్ సెట్లలో కనీసం వాష్‌రూమ్‌లు, క్యారవాన్‌లు ఉండేవి కావని తెలిపారు. బట్టలు మార్చుకోవడానికి కూడా సరైన ప్రైవసీ ఉండేది కాదని, అంబాసిడర్ కార్లలో కూర్చుని బాటిళ్లలోనే మూత్ర విసర్జన చేసిన సందర్భాలున్నాయని చెప్పారు. ఆ కష్టాలతో పోలిస్తే ఇప్పటి నటీనటులు చాలా అదృష్టవంతులని, తాము పడిన కష్టాల్లో పావు వంతు కూడా వారు అనుభవించలేదని అన్నారు. ఇక, సినిమాల విషయానికొస్తే.. రమ్యకృష్ణ ఇటీవల రజనీకాంత్‌తో కలిసి 'జైలర్ 2'లో నటించారు. వీటితో పాటు 'రాకా', 'శ్రీ శ్రీ', 'పాకెట్ నావెల్', 'తేరా యార్ హూ మే' వంటి చిత్రాలు ఆమె చేతిలో ఉన్నాయి.



ఓటీటీకి తమిళ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్!

ఓటీటీ ట్రాక్ పైకి అడుగుపెట్టడానికి ఒక తమిళ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ సిద్ధమవుతోంది. రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో రూపొందిన సినిమాలను చూడటానికి యూత్ ఎక్కువగా ఇంట్రెస్ట్ చూపిస్తుంది. లవ్ .. రొమాన్స్ .. యాక్షన్ తో థ్రిల్ చేసే ఈ తరహా సినిమాలకు ఓటీటీలలో విశేషమైన ఆదరణ లభిస్తూ ఉంటుంది. అందువల్లనే ఈ తరహా కంటెంట్ ను ఆవిష్కరించడానికి ఓటీటీ సెంటర్లు పోటీపడుతూ ఉంటాయి. ఈ నేపథ్యంలో 'సోనీ లివ్' ద్వారా పలకరించబోతున్న సినిమానే 'అన్బిల్ అవన్'. కరుణ మూర్తి – అభినయ సెల్వన్ నిర్మించిన ఈ సినిమాకి, కార్తికేయన్ దర్శకత్వం వహించాడు. అశోక్ సెల్వన్ – ప్రీతిముకుందన్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమాలో, రేవతి .. ధిల్లీ గణేశ్ .. కదిర్ బాలు ముఖ్యమైన పాత్రలలో కనిపించనున్నారు. గోవింద్ వసంత సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా, అక్టోబర్ 2వ తేదీన థియేటర్లలో విడుదలైంది. అలాంటి ఈ సినిమా, ఈ నెల 20వ తేదీ నుంచి నుంచి 5 భాషల్లో 'సోనీ లివ్'లో స్ట్రీమింగ్ కానుంది. అందుకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చేసింది. సూర్య .. ఇయల్ ప్రేమించి పెళ్లి చేసుకుంటారు. ఇద్దరూ సరదాగా గడపాలని అనుకుంటారు. అందుకోసం ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా, హిల్ స్టేషన్ లో ఒక ఖరీదైన ఇంటిని సూర్య కొనుగోలు చేస్తాడు. ఇద్దరూ కలిసి అక్కడికి వెళతారు. ఆ ఇల్లు .. ఆ పరిసరాలు చూసి ఇయల్ సంబరపడిపోతుంది. అయితే ఆ సంతోషం ఎక్కువసేపు నిలవదు. తాము చాలా పెద్ద ప్రమాదంలో చిక్కుకున్నామనే విషయం అర్థం కావడానికి వాళ్లకి కాస్త సమయం పడుతుంది. ఆ ప్రమాదం ఏమిటి? ఆ ఇంటిని .. భార్యను రక్షించుకోవడం కోసం సూర్య ఏం చేయవలసి వస్తుంది? అనేదే కథ.



PRINTED ,PUBLISHED ,OWNED BY TEHELKA MEDIA NETWORK ,DIGITAL NEWS .Regd no:2019/28814, EDITOR :K.CHANDRA SHEKHAR, EXECUTIVE EDITOR :K.SRINIVAS RAO, G6 MES Colony, Alwal , Secunderabad -500010.e-mail:Tehelkamedianetworks@gmail.com